ప్రభాత

కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 05 మార్చి 2026

గల్ఫ్ దేశాల్లోని ఆంధ్రులకు ప్రభుత్వం పూర్తి రక్షణ

రాష్ట్ర మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి

మదనపల్లె, మార్చి 4 ప్రభాతవార్త :

గల్ఫ్ దేశాల్లో జరుగుతున్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రవాస ఆంధ్రుల రక్షణకు ప్రభుత్వం పూర్తి రక్షణగా ఉంటుందని రాష్ట్ర క్రీడా, రవాణాశాఖా మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ తరపున వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గల్ఫ్ దేశాల్లో ఎక్కువుగా అన్నమయ్య జిల్లాకు చెందిన వారు ఉన్నారన్నారు. ఏపిఎన్ఆర్‌టిఎస్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో తాత్కాలిక వసతి, భద్రత, తక్షణ న్యాయసహాయం అందిస్తామన్నారు. ఢిల్లీలోని ఆంధ్రా భవన్‌లో ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏపిలో కూడా 24గంటలు కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరికి పూర్తి సహాయసహకారం అందిస్తామని తెలిపారు. గల్ఫ్ దేశాల్లో ఎవరికైన సమస్యలు ఎదురైతే వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్ 0863-2340678, వాట్సప్‌నెంబర్ 918500027678నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

కడప క్రైం, మార్చి 4, ప్రభాతవార్త:

జిల్లాలో సీసీ కెమెరాల నిఘాను బలోపేతం చేసి దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు జరగకుండా చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. జిల్లాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 495 సీసీ కెమెరాలు, మ్యాట్రిక్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 650, ప్రైవేటు సీసీ కెమెరాలు 4732 కలిపి 5877 సీసీ కెమెరాలు పని చేస్తున్నాయన్నారు. నిరంతరం అనుమానాస్పద కదలికలు గల వారిపై నిఘా ఉంచడం జరిగిందన్నారు. గత ఏడాది సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 12 చైన్ స్నాచింగ్ కేసులు నమోదు కాగా అందులో 5 కేసులు ఛేదించి రూ.5.35లక్షలు విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. మిగిలిన కేసులు కూడా ఛేదించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది ఇటీవల పలు కేసుల్లో తక్షణమే స్పందించి బాధితులు పోగొట్టుకున్న సొత్తును రికవరీ చేయడంలో కీలక పాత్ర పోషించారని ఎస్పీ వివరించారు. మహిళలు తమ చుట్టుపక్కల నివాసాల పరిధిలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే 112 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే బంగారు ఆభరణాలు ధరించి ఒంటరిగా బయటకు వెళ్లినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సైబర్ నేరగాళ్ల కోసం గాలింపు

మదనపల్లెక్రైమ్, మార్చి 4 ప్రభాతవార్త.

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో భారీ స్థాయిలో సైబర్ మోసాలకు పాల్పడి, మదనపల్లె లో తలదాచుకున్న నిందితుల కోసం వెస్ట్ బెంగాల్ పోలీసులు బుధవారం మదనపల్లెలో గాలింపు చర్యలు చేపట్టారు. వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో జరిగిన పలు సైబర్ క్రైమ్ కేసుల్లో ఐదుగురు నిందితులు కీలక పాత్ర పోషించినట్లు అక్కడి పోలీసులు గుర్తించారు. సాంకేతిక ఆధారాల సాయంతో నిందితుల కదలికలను ట్రాక్ చేయగా, వారు మదనపల్లెను కేంద్రంగా చేసుకుని తమ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో ఈ కేసును ఛేదించేందుకు వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఒక సీఐ, ఒక ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లతో కూడిన ప్రత్యేక బృందం బుధవారం మదనపల్లెకు చేరుకుంది. స్థానిక పోలీసుల సహకారంతో నిందితుల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. మదనపల్లె వంటి పట్టణాల్లో సైబర్ నేరగాళ్లు మకాం వేయడం స్థానికంగా కలకలం రేపుతోంది.

రీసర్వే పనులను చురుగ్గా చేపట్టాలి

కడప, మార్చి 4 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూ రికార్డుల స్వచ్ఛీకరణ, రీ సర్వే పనులను.. జిల్లాలో ప్రణాళిక ప్రకారం చురుగ్గా చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర రాజధాని నుండి రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, రాష్ట్ర భూ పరిపాలనా శాఖ (సీసీఎల్ఏ) ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మితో కలిసి.. భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా రెవెన్యూ క్లినిక్స్, పిజిఆర్ఎస్, మ్యుటేషన్స్ (ఉత్పరివర్తనలు), రీసర్వే, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీ లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితో పాటు.. జేసీ నిధి మీనా హాజరయ్యారు.విసి ముగిసిన అనంతరం జిల్లాలోని అన్ని మండలాల రెవెన్యూ అధికారులతో విసి ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి వారి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న రీసర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మ్యూటేషన్ లో భాగంగా సేల్, సబ్ డివిజన్, జాయింట్ ఎల్పిఎం తదితర వ్యక్తిగత వివరాలలో ఎటువంటి తప్పిదాలు లేకుండా పూర్తి చేసి పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. రీసర్వే కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి ఆటంకాలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పన కోసమే ఈ రీసర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. అలాగే.. భూ సమస్యలపై పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్స్ ద్వారా అందే అర్జీల పట్ల..

సదరు అర్జీ ప్రాథమిక పరిశీలన దశలో ఉన్నట్టు సమాచారం అర్జీదారులకు అందించడం బాధ్యతగా చేపట్టాలన్నారు. ఈ విసి కార్యక్రమంలో కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి ల్యాండ్ సర్వే శాఖ ఈడి శాంతరాజు, సంబందిత సెక్షన్ సూపరింటెండెంట్లు, రెవెన్యూ అధికారులు సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి ఎస్సీ కార్పొరేషన్ పౌల్ట్రీ ఫారంలో

అక్రమాలపై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విచారణ

బోయినపల్లి పౌల్ట్రీ ఫారంలో విచారణ చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడి రాజ్యలక్ష్మి

రాజంపేట, మార్చి 4 ప్రభాతవార్త

రాజంపేట మండలం బోయినపల్లి వద్ద దశాబ్దాల క్రితం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్దారులకు అందజేసిన పౌల్ట్రీ ఫారం కాంప్లెక్స్లో చోటుచేసుకున్న అక్రమాలపై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి గురువారం విచారణ నిర్వహించారు. ఇప్పటికే రెండు ,మూడు సార్లు ఈ అక్రమాలపై విచారణ నిర్వహించారు. పౌల్ట్రీ ఏర్పాటు కోసం ఏర్పాటు చేసిన షెడ్లు పలువురు లబ్ధిదారులు అమ్మి వేశారు. ఈ పరిసరాల్లో భూముల విలువ విపరీతంగా పెరిగిన నేపథ్యంలో పౌల్ట్రీ ఫారం లో ఉన్న స్థలాలకు గిరాకీ ఏర్పడింది. సెంటు ఐదు లక్షల నుంచి ఏడు లక్షలు వరకు ధర పలుకుతుంది. పలురు లబ్ధిదారులు విక్రయించారు. పౌల్ట్రీ కాంప్లెక్స్ పరిసరాలలో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ భూముల్లో కూడా అక్రమార్కులు చెరపట్టారు. దౌర్జన్యంగా కొందరు ఆక్రమించారు. అక్రమించినవారు పెద్ద ఎత్తున ఇల్లు నిర్మించారు. ఎస్సీ కార్పొరేషన్ షెడ్లను కూడా కొనుగోలు చేసి ఇండ్ల నిర్మాణం చేపట్టారు. ఇసుకపల్లి రోడ్డులో ఏకంగా దుకాణాలు కూడా వెలిశాయి. దీనిపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి సమగ్ర విచారణ చేపట్టారు. పౌల్ట్రీ కాంప్లెక్స్ ఏర్పాటు చేసిన సమయంలో లబ్ధిదారులు ఎవరు, ప్రస్తుతం ఎవరి వద్ద ఉన్నాయి, ఎవరు విక్రయించారు, ఎవరు కొన్నారు, తదితర వివరాలు సేకరించారు. అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఎట్టి పరిస్థితులలోనూ సహించేది లేదని స్పష్టం చేశారు.పూర్తిస్థాయిలో కొలతలు కూడా వేశారు. సరిహద్దులు నిర్ణయించారు. దీంతో కొనుగోలు చేసిన బయట వ్యక్తులు లబోదిబో మంటున్నారు.

నిధులు కేటాయింపుపై హర్షం

రాయచోటి మార్చి4 ప్రభాతవార్త

అసెంబ్లీలో క్రీడలు మరియు యువజన సేవలకు నిధుల కేటాయింపుపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపి నట్లు ఆయన తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. క్రీడాకారులకు రిజర్వేషన్‌ను 2 నుంచి 3కు పెంపు. డీఎస్సీ నియామకాలలో క్రీడాకోటా ద్వారా 420 పోస్టుల కేటాయింపు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 800 మంది క్రీడాకారులకు ప్రయోజనం కల్పించడం జరుగుతుందన్నారు. క్రీడల అభివృద్ధికి రూ.24 కోట్లు కేటాయింపు. అలాగే 9 క్రీడా వికాస కేంద్రాల (రీజురీ) నిర్మాణం కొనసాగింపు. కొత్త కేవీకే నిర్మాణానికి రూ.29 కోట్లు కేటాయించాలని ప్రతిపాదన పంపినట్లు ఆయన తెలియజేశారు. ఖేలో ఇండియా పథకం ద్వారా రూ.76 కోట్లుతో సమీకరణ చేసినట్లు ఆయన తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు సారధ్యంలో మంత్రి లోకేష్ చర్చల ఫలితంగా కేంద్ర నిధుల సమీకరణ సాధ్యమవుతుందన్నారు. CSR నిధుల ద్వారా అన్ని నియోజకవర్గాల్లో క్రీడలకు నిధులు సమకూర్చడం జరుగుతుందన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు, అమరావతిలో జాతీయ క్రీడల నిర్వహణకు కార్యాచరణ ప్రారంభించినట్లు ఆయన తెలియజేశారు. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తిరుపతి, అమరావతి, విశాఖపట్నం లో మూడు జోన్లుగా క్రీడా అభివృద్ధి ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారుల అభ్యున్నతికి చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలియజేశారు. గ్రూప్1, గ్రూప్2 ఉద్యోగాల్లో క్రీడాకారులకు అవకాశాల కల్పన. గత వైసిపి ప్రభుత్వంలో క్రీడలు మరుగునపడేలా చేసిందని మంత్రి ఆరోపించారు. రాష్ట్రంలో సమగ్ర క్రీడా అభివృద్ధికి, రాష్ట్ర అభివృద్ధి కోసం మరియు ప్రజల సుఖసంతోషాల కోసం ప్రభుత్వం కృతనిచ్చయంతో కట్టుబడి ఉందని మంత్రి తెలియజేశారు.

బాణసంచా కేంద్రాలను మూసివేయాలి : ఎస్పీ

మదనపల్లెక్రైమ్, మార్చి 4 ప్రభాతవార్త.

టపాసుల తయారీ కేంద్రాలు, విక్రయశాలలో తనిఖీలు పూర్తయ్యే వరకు వాటిని మూసివేయాలని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఎస్పీ మాట్లాడుతూ కాకినాడ జిల్లా, వేట్ల పాలెంలో జరిగిన బాణసంచా ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా టపాసుల తయారీ కేంద్రాలు, విక్రయశాలలపైకఠిన నిబంధనలు అమలు చేస్తున్నామన్నారు. తనిఖీలు పూర్తయ్యే వరకు జిల్లాలోని అన్ని బాణసంచా కేంద్రాలను తాత్కాలికంగా మూసివేయాలన్నారు.మదనపల్లె, రాయచోటి సబ్‌డివిజన్ల పరిధిలో రెవెన్యూ, అగ్నిమాపక శాఖల సమన్వయంతో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారన్నారు. బాణసంచా నిల్వ కేంద్రాలకు ఖచ్చితంగా లైసెన్స్‌లు ఉండాలన్నారు. గోడౌన్లలో తగినంత ఇసుక, నీరు, అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉండాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా ఖిస్పార్క్‌ప్రూఫ్‌ఖి సిస్టమ్స్ ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి విక్రయశాల వద్ద ఖచ్చితంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి ఫీడ్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. అనుమతించిన పరిమితికి మించి బాణసంచా నిల్వ చేస్తే వాటిని సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తయారీ కేంద్రాల్లో కార్మికులు కాటన్ దుస్తులనే ధరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. అక్రమంగా టపాసులు నిల్వ చేసినట్లు గమనిస్తే 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పులివెందుల,మార్చి 4, ప్రభాత వార్త :

నియోజక వర్గ పరిధిలోని లింగాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పార్నపల్లె గ్రామంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే విస్తృతంగా నిర్వహించ డమైనది.సర్వే సందర్భంగా ప్రతి ఇంటిని సందర్శించి, కుటుంబ సభ్యుల్లో ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నారా అనే విషయాన్ని విచారించి, మలేరియా మరియు డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించి, ఫ్రైడే డ్రైడే ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించారు, ఇంటి ప్రాంగణాలు, నీటి ట్యాంకులు, కుండీలు, డ్రములు వంటి చోట్ల నిల్వ నీటిలో దోమల లార్వా ఉన్నాయా లేదా అన్నది పరిశీలించి, లార్వా నిర్మూలన కొరకు అబేట్ పిచికారీ చేయడమైనది. ఈ కార్యక్రమములో సిద్దయ్య మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లలో నిల్వ నీటిని తరచుగా ఖాళీ చేయాలి, నీటి ట్యాంకులకు మూతలు పెట్టాలి అని, దోమల నుండి రక్షణ కోసం దోమతెరలు వాడాలి అని సూచించారు. అలాగే, జ్వరం వచ్చినప్పుడు తక్షణం ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని ప్రజలకు సిద్దయ్య సూచించారు. ఈ కార్యక్రమములో సి.హెచ్.ఓ. గాయత్రి, ఆరోగ్య కార్యకర్త రాజేశ్వరీ ఆశా కార్యకర్తలు సునందన, మణి పాల్గొన్నారు.

ప్రత్యేక విభాగాల అధికారులతో సమీక్ష

- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు
- జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, మార్చి 4, ప్రభాతవార్త:

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై, ఫ్యాక్షన్ సంబంధం ఉన్న వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు శాఖలోని ప్రత్యేక విభాగాలైన ఫ్యాక్షన్ జోన్, సైబర్ క్రైం, ట్రాఫిక్ ఎస్పీ, ఎస్టీ సెల్, డీసీఆర్‌బీ, డీటీబీఆర్‌బీ, కోర్ట్ మానిటరింగ్ సెల్ తదితర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎక్కడైనా మానవ అక్రమ రవాణా జరుగుతుంటే గుర్తించి తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో నమోదైన సైబర్ క్రైం కేసులను ఛేదించేందుకు సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులకు దర్యాప్తులో సహకరించాలన్నారు. జిల్లాలో జరిగిన గ్రేవ్ చోరీ కేసుల్లో దొంగలను అరెస్టు చేసి చోరీ సొత్తు రికవరీ చేసేలా సంబంధిత పోలీసు అధికారులకు దర్యాప్తులో సహకరించాలని ఎస్పీ అధికారులకు సూచించారు. తీవ్రమైన కేసుఉలలో విచారణ త్వరితగతిన జరిగి నేర నిరూపన చేసి నేరస్తులకు శిక్ష పడేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో మహిళలు, బాలికలపై అసభ్యకరమైన పోస్టులు పెట్టే వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెడ్ సాండర్స్ టాస్క్‌పోర్స్: ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి కఠిన చర్యలు చేపట్టాలన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. శక్తి టీంల బీట్లు పెంచాలని ఈవ్‌టీజింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీటీఆర్‌బీ: రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి ఇతర శాఖల అధికారఉల సమన్వయం చేసుకొని ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, జిల్లాలోని వివిధ ప్రత్యేక విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కళాశాల విద్యార్థినిల ప్రతిభ

పులివెందుల, మార్చి 4 , ప్రభాతవార్త :

జాతీయ సమైక్యత శిబిరాన్నీ పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యా వాలంటీర్లు విజయవంతంగా పూర్తి చేశారు. కళాశాలకు చెందిన విద్యార్థినిలు సి. గౌరీ, ఎస్. ఆయిష జాతీయ స్థాయి శిబిరానికి ఎంపికై విశేష ప్రతిభ కనబర్చారు.గత నెల ఫిబ్రవరి 24 నుండి మార్చి 2 వరకు కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ సమన్వయంతో కర్ణాటక ప్రభుత్వ సహకారంతో ఈ జాతీయ సమైక్యత శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరం కర్ణాటక రాష్ట్రంలోని బెలగావి నగరంలో ప్రతిష్ఠాత్మకంగా జరిగింది.శిబిరంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యువతతో కలిసి పలు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న గౌరీ, ఆయిషలు తమ ప్రతిభను చాటుకున్నారు. భిన్న భాషలు, సంస్కృతి, సంప్రదాయాల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడంలో వారు కీలకపాత్ర పోషించారు. ఒకే వేదికపై భారతీయ ఐక్యతను ప్రతిబింబించేలా వారి పాల్గొనడం విశేషంగా నిలిచింది.వారి ప్రతిభను గుర్తించి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ మరియు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ యు. శ్రీనిత, అధ్యాపకులు ఎన్. శ్రీనివాసులు రెడ్డి తదితరులు విద్యార్థినిలను అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో కళాశాల ప్రతిష్ఠను పెంచాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం మాట్లాడుతూ, జాతీయ సమైక్యత శిబిరాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి విలువలను పెంపొందిస్తాయని తెలిపారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం

గజ వాహనంపై దర్శనమిచ్చిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారు

పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

బద్వేల్ అర్బన్, మార్చి 4, ప్రభాతవార్త

బద్వేలు మండలంలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తుల దర్శన అనంతరం గ్రామోత్సవాన్ని మంగళ వాయిద్యాల నడుమ వైభవోపేతంగా నిర్వహించారు సాయంత్రం వేలాదిమంది భక్తులు తరలివచ్చి ఆలయంలో శ్రీవారి మూలవిరాటును దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు గ్రామంలో కొలువుదీరిన పలు ఆలయాలను సందర్శించి స్వామి దర్శనం చేసుకున్నారు రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉన్న బద్వేల్ పెద్ద చెరువును సందర్శించి మట్టి రాజుల కాలంలో నిర్మించిన పెద్ద చెరువు చిన్న తోము పెద్ద తూము కట్టడాలను పరిశీలించి ఆశ్చర్యపోయారు. ఇంతటి అద్భుత కట్టడాలు లక్ష్మీ పాలెం గ్రామ పరిసరాలలో ఉండడం చాలా గొప్ప విషయమని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు ఆలయ కమిటీ వారు గాధల సహకారంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు రాత్రి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. రాత్రి 9 గంటలకు శ్రీదేవి భూదేవి శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు మొగదలై భారద్వాజు మొగదలై శ్రవణ్ నేతృత్వంలో వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని వేలాదిమంది భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా మంత్రోచ్చారణల మధ్య వేదమంత్రాల మధ్య జరిపించారు వేదాంతాచార్యులు కుమారుడు నరసింహచార్యులు కుటుంబం వారు శ్రీవారి తరుపున కళ్యాణానికి పీటల మీద కూర్చోగా కన్యాదాత సాంఖ్య వరులు తిరువెంగళపురం గ్రామానికి చెందిన పూలుచెర్ల గురవయ్య భార్య నర్సమ్మ కుటుంబం వారు కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు దాతల సహకారంతో హైదరాబాదుకు చెందిన కళాకారులతో నిర్వహించిన పాట కచేరి భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నది కళ్యాణ అనంతరం భక్తులు స్వామివారికి చదివింపులు చదివించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం గజ వాహనంపై శ్రీవారిని అలంకరించి భక్తుల దర్శన మంత్రం బ్రహ్మోత్సవం నిర్వహించారు .వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ కమిటీ వారు వాలంటీర్లు బద్వేల్ పట్టణ పోలీసు వారు బందోబస్తు నిర్వహించి అందరికీ స్వామివారి దర్శనం కలిగేలా చూశారు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నూతనంగా తయారు చేసిన రథం పై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారు ఆసీనులై రథోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరుగుతోందని రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని భక్తులు స్వామివారి రధాన్ని లాగితే వారికి కష్టాలు తొలగి పోయి సుఖ సంతోషాలు సిరి సంపదలు చేకూరుతాయని వేద పండితులు భక్తులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సత్య సంజీవ కుమార్ ఆలయ ధర్మకర్తలు కర్ణమడకల బీనా, మెంటా ప్రసన్న కిరణ్ కుమార్, నల్లి వీరమ్మ, సంపతి వెంకటసుబ్బయ్య, ఆనుగొంది ఓబులేసు, లక్ష్మమ్మ, వంటే చిన్న పీరయ్య, నాగయ్య గారి సిద్దమ్మ, ఈవో రామలింగారెడ్డి పలు శాఖల అధికారులు పట్టణ పోలీసు అధికారులు వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు ప్రపంచ స్థాయి గుర్తింపును తెస్తాం

కడప, మార్చి 4 ప్రభాతవార్త :

జిల్లాలోని అన్ని పర్యాటక కేంద్రాలకు జాతీయ, ప్రపంచ స్థాయిలో కీర్తిని ప్రతిబింబించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా టూరిజం కౌన్సిల్ చైర్మన్, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జేసీ డా. నిధి మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వైఎస్ఆర్ కడప జిల్లాలో చారిత్రక, పర్యటక, దర్శనీయ స్థలాలు ఎన్నో ఉన్నాయని.. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు జిల్లా పర్యాటక రంగం ప్రధాన భూమిక పోషించే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. జిల్లాలో ఉన్న చరిత్రక, పర్యాటక ప్రాశస్తం ఉన్న సందర్శనీయ స్థలాలు, క్షేత్రాలను గుర్తించి వారి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గండికోట ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాల్లో క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కోసం ప్రత్యేక సహకారం అందించే పథకం ద్వారా.. గండికోట పర్యాటక కేంద్రంలో సుసంపన్నమైన కోట మరియు గార్జ్ అనుభవాన్ని పర్యాటకుల సొంతం చేసే దిశగా.. జిల్లా యంత్రాంగం పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి పనులకు నాంది పలికిందన్నారు.గండికోట పర్యాటక కేంద్రం అభివృద్ధి పథకంలో భగంగా చేపట్టే అన్ని రకాల పనులకు సంబంధించి మ్యాపులను, డిజైన్లను పరిశీలించి పలు సూచనలు, సలహాలను అందించారు. పనుల నాణ్యతతో ఎలాంటి రాజీ లేకుండా.. అన్ని రకాల పర్యటన ప్రాజెక్టులను చేపట్టాలని ఆదేశించారు. ఏపీ టూరిజం కార్పొరేషన్ తో ఏపీలో అమలు చేస్తున్న టూరిజం పాలసీలో భాగంగా పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పిస్తున్నామన్నారు. అందులో భాగంగానే పర్యాటకులు బస చేసేలా స్టార్ హోటళ్లు, ఇతర ఆకర్షణీయమైన నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందన్నారు. టూరిస్టులను ఆకర్షించేలా గండికోట వద్ద వ్యూపాయింట్ తో



పాటు, చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించేలా శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా పర్యాటక ప్రదేశాలకు ప్రపంచ స్థాయి గుర్తింపును సొంతము చేసుకునేందుకు జిల్లాలోని చరిత్రకారులు, పర్యాటక ప్రియులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం టూరిజం కౌన్సిల్ కమిటీ

జిల్లా ఆర్థికాభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలి

కడప, మార్చి 4 ప్రభాతవార్త :
వికసిత భారత్, స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్య సాధన లో భాగంగా.. "విజన్ యాక్షన్ ప్లాన్ 202429" మేరకు జిల్లాను ఆర్థికంగా బలోపేతం చేయడంలో భాగస్వామ్యం కావాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి బ్యాంక్ అధికారులను ఆదేశించారు. బుధ వారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావే శంలో.. జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల ఋణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆ యా బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీ క్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మా ట్లాడుతూ అంతేకాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదే శానుసారం వికసిత భారత్ లక్ష్య సాధనలో భాగం గా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్రప్రదేశ్ 2047 దిశగా "వైఎస్ఆర్ కడప జిల్లా విజన్ యా క్షన్ ప్లాన్ 2024,29" ప్రకారం జిల్లాను ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. రుణాలు అందించడంలో డిసెంబర్ మాసంతానికిగాను వైఎ స్ఆర్ జిల్లా పురోగమనంలో లక్ష్యాన్ని అధిగమించి నందుకు బ్యాంకర్లను అభినందించారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పని చేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలోని అన్ని స్వయం సహా యక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూల న, మహిళా అభివృద్ధి, సాధికారిత... పొదుపు సం ఘాల బలోపేతంలోనే సాధ్యం అవుతుందన్నారు. అన్ని రంగాల అభివృద్ధికి అపారమైన వనరులు ఉ న్న ఆకాంక్ష జిల్లాను రాష్ట్ర, దేశ అభివృద్ధితో పా టు.. గ్లోబల్ ఎకానమీలో కీలక స్థానంలో నిలపాల న్నారు. డిఆర్డీఏ, మెప్మా శాఖల అధికారులు స్వ యం సహాయక సంఘాల్లో ఆసక్తిని, బిజినెస్ స్కి ల్స్‌ను అభివృద్ధితో పాటు పొదుపు సంఘాల మహి ళలకు రుణాలు అందించి.. జిల్లాను ఆకాంక్ష జిల్లా లక్ష్య సాధనలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాల న్నారు. సేంద్రియ సాగుబడిలో పండించిన పంట దిగుబడులకు మంచి ఆదరణ లభిస్తుందని ఎలాం టి హానికరం లేని నేచురల్ ఫార్మింగ్ ద్వారా వ్యవ సాయ సాగుబడిని పెంచే అన్ని రకాల అధునాతన పద్ధతులకు అవసరమైన సాంకేతిక మౌలిక సదు పాయలను సమకూర్చుకునేందుకు రైతులకు అవసరమైన రుణాలను అందించేలా బ్యాంకర్లు ప్రోత్సహించాలన్నారు. ప్రత్యేకించి జేఎంఎల్ బిసి (జాయింట్ మండల లెవెల్ బ్యాంకర్స్ కమిటీ) మీ టింగ్స్ కు సంబంధిత అన్ని శాఖల అధికారులు ఖచ్చితంగా హాజరవ్వాలన్నారు. ఈ స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు నూతన పరిశ్రమల ఆవిష్కరణకు అవసరమైన వనరులపై చర్చించాలన్నారు. జిల్లాలో త్వరలో ప్రారంభం కానున్న స్టార్ట్ అప్ కడప ఎంట్రప్రె న్యూర్ షిప్ కేంద్రం ద్వారా దాదాపు ఏడాదికి 100 వరకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి.. ఆయా రంగాల్లో యువతకు నైపుణ్యాలను అందించి ప్రొఫెషనల్ ఎంట్రప్రెన్యూర్లుగా అభివృద్ధి చేసే కా ర్యక్రమాలపై బ్యాంకర్లు కూడా భాగస్వామ్యం వహించి ఆర్థిక చేయూతను ఇవ్వాలన్నారు. అర్హులైన యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లబ్ది చేకూర్చేలా రుణ సదుపాయాలు కల్పించాలన్నారు. 2025,26 ఆర్థిక సంవత్స రానికి గాను 2025 డిసెంబర్ 31వ తేదీ నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.24,151.71 కోట్లు కాగా.. లక్ష్యాన్ని అధిగమించి రూ.25,888.15 కోట్ల మేర రుణాలు మంజూరు చేసి 107.53!! ఆర్థిక ప్రగతిని సాధించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో నాబార్డు డీడీఎం విజయ విహారి, యూబీఐ ఎజిఎం లక్ష్మీ తులసి, కెడిసిసి సీఈఓ రాజమ్మ, ఎపిజిబి ఆర్ఎం శ్రీనివాస్, డిఆర్డీఏ, మె ప్మా పిడీలు రాజ్యలక్ష్మి, కిరణ్ కుమార్, ఇండస్ట్రీస్ జీఎం చాంద్ బాషా, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సతీష్ కుమార్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి హిద యతుల్లా, అనుబంధ శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ చేసిన ఆరోపణలు అవాస్తవం

ప్రొద్దుటూరు మార్చి 4 ప్రభాతవార్త

మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూ రు మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న శనగల కొనుగోలు కేంద్రం పై టిడిపి నాయకులు ప్రవీణ్‌రెడ్డి చేసిన ఆరోపణ లు అవాస్తవాలని టిడిపి నాయకులు రసూల్ గౌస్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సుధాకర్ తెలిపారు. బుధవారం స్థానిక చౌడేశ్వరి నగర్ లోని రసూల్ గౌస్ కా ర్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రొ ద్దుటూరు ఎమ్మెల్యే వరద రాజుల రెడ్డి అనుచరుల మైన తాము ఎలాంటి అవి నీతికి పాల్పడమన్నారు. ప్రొద్దుటూరులో మార్క్ ఫెడ్ సుధాకర్ ఆధ్వర్యంలో వుందని, ప్రొద్దుటూరు మార్కెట్‌యార్డ్‌కు జిల్లా అధికారుల పర్యవేక్షణ వుందని, తాను ఎమ్మెల్యే ఆదేశాలతో అక్కడ పనులు చూస్తున్నానని వివరించారు. ప్రవీ ణ్ కు ఎవరో తప్పుడు సలహాలు ఇచ్చారని, ఆయన వ్యాఖ్యల వలన పార్టీ కి నష్టమన్నారు. ఎన్నికల సమయంలో తాను టిడిపి తరపున ప్రచారంలో పాల్గొ న్నానని, వైసీపీ వారు తనను ఆ కారణంగానే ఉద్యోగం నుంచి తొలగించారని, తిరిగి కూటమి ప్రభుత్వం రాగానే తాను ఉద్యోగంలో చేరానని తెలిపారు. తాను అవినీతికి పాల్పడినట్లు ఆరోపించిన ప్రవీణ్ తన బ్యాంక్ ఖాతా తీసికొని వివరాలు సరి చూసుకోవాలన్నారు. తాను చేసే ప్రతి కార్యక్రమం పార్టీ కి తెలుపుతానన్నారు. రైతులను గౌరవించే వరద అనుచరులుగా రైతులను ఇబ్బంది పెట్టమని, యువతపై బురదజల్లడం టిడిపి మాజీ ఇంచార్జ్ గా ప్రవీణ్ కు సరికాదన్నారు. సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ నియామల ప్రకారమే తా ము పనిచేస్తున్నామని, హమాలీ ఖర్చు రైతులే భరించాలన్నారు. తాము 200 రూపాయలు బ్యాగ్ వసూలు చేసినా, అధికంగా శనగలు తీసుకున్నా నిరూపిం చాలని, తాము తప్పు చేసి వుంటే చట్టపరమైన చర్యలకు సిద్ధమన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు

కడప క్రైం, మార్చి 4, ప్రభాతవార్త:
జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు అధికారులు పటిష్టమైన బందోబస్తు ఏ ర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీ క్షా కేంద్రాలు ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయించేలా చర్యలు చేపట్టారు. సెంటర్ల వద్ద సీఐలు, ఎస్సైలతో పాటు పోలీసు సిబ్బందిని నియమించి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. సెంటర్ల వద్ద మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకుండా కట్టుది ట్టమైన తనిఖీలు నిర్వహించారు. అలాగే ప్రశ్నాపత్రాల రవాణా భద్రతా పరం గా ప్రత్యేక ఎస్కార్ట్ ఏర్పాటు చేశారు. సెంటర్ల పరిసర ప్రాంతాలలో అనుమా నాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు, సంఘటనలు తలెత్తకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆదేశిం చారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని జిల్లా ఎస్పీ సూచించారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

కడప క్రైం, మార్చి 4, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదే శాల మేరకు బుధవారం కడప వన్‌టౌన్ పీఎస్ పరిధిలో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యం లో కడప ట్రాఫిక్ స్టేష న్‌లో సీఐ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల పట్టణంలో సీఐ విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకో రాదన్నారు. యూనిఫాం తప్పనిసరిగా ధరించి ఆటో నడపాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని డ్రైవరు పక్కన అదనపు సీట్లు పెట్టుకొని ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. మోటారు వాహనాల చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిం చిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఊరి బడిని కాపాడుకుందాం

పోరుమామిళ్ల రూరల్, మార్చి4 ప్రభాత వార్త:

పేదలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అం దాలంటే ఊరి బడిని కాపాడుకోవాల్సిం దేన ని UTF జిల్లా అధ్యక్షుడు మాదన విజయ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గేగినీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాంఊరి బడిని కాపాడుకుందాం" అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తే వి ద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుతారని వారు సూచించారు.

ఘనంగా మొయిళ్లకాల్వ ఉరుసు

పెండ్లిమర్రి, మార్చి 4, ప్రభాతవార్త:
పెండ్లిమర్రి మండలం మొయిళ్లకాల్వ గ్రామంలో బుధవారం ఘనంగా ఉరుసు జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి స్వామి వారికి పూజలు చేసి అలాగే బండలాగుడు పోటీలు ప్రారంభించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

కస్తూరిబా బాలికల పాఠశాల తనిఖీ

చిన్నమండెం మార్చి 04 ప్రభాతవార్త:
మండలంలోని కస్తూరిబా బాలికల పాఠశాల ను బుధవారం మండల పరి షత్ అభివృద్ధి అధికారి ఆదినారాయణ సందర్శించడం జరిగింది అందులో భాగంగా విద్యార్థుల యొక్క సౌకర్యాలు అడిగి తెలుసుకోవడం జరిగింది అ లాగే వంటగదిని మరియు స్టాక్ రూమ్ ను పరిశీలించడం జరిగింది. మరియు వంట చేస్తున్నపుడు ఎలా ఉండాలో వంట మనుషులకు తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది మరియు విద్యార్థుల యొక్క ప్రోగ్రెస్ అడిగి తెలు సుకోవడం జరిగింది.

దేవుడిపై రాజకీయం చేయడం హేయమైన చర్య..

యర్రగుంట్ల మార్చి 4, ప్రభాతవార్త:
శాసనమండలిలో బుధవారం రాష్ట్ర మంత్రి అచ్చం నాయుడు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ యర్రగుంట్ల కు చెందిన వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మాడిశెట్టి శివ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత పవిత్రవంతమైన కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదం మీద శాసనమండలిలో మంత్రి అచ్చం నాయుడు చేసిన వ్యాఖ్యలు దారుణం అన్నారు. కులాల మధ్య ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా మంత్రి మా ట్లాడుతున్నారని తిరుమల లడ్డులో కల్తీ జరిగిందని ఇష్టానుసారంగా మా ట్లాడడం హేయమైన చర్య అని దేవుడిపై కూడా రాజకీయం చేసే నీచ రాజ కీయ చరిత్ర కేవలం టిడిపికే సొంతమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు అ న్నీ గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు.

గల్ఫ్‌లో ఉన్న ప్రవాసాంధ్రులు అందరూ క్షేమం

కడప కార్పొరేషన్ మార్చి 4 ప్రభాతవార్త:
ఇరాన్ అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాలలో విమానాశ్ర యాలు బంద్ చేశారని గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బి.హెచ్ వెల్లడించారు. గల్ఫ్ (జీసీసీ)లో భారతదేశానికి సంబంధించిన పౌరులు సుమారు 95 లక్షల పైగా ఉన్నారని, ఏపీకి చెందినవారు వా సుమారు 25 లక్షలకు పైగా ఉన్నారన్నా రని.. అందులో ఉమ్మడి కడప జిల్లా, ఉభయ గోదావరి జిల్లా వాసులు ఎక్కు వ శాతం సంఖ్యలో ఉన్నారని తెలిపారు. ఏపీకి చెందిన ప్రవాసాంధ్రులను సురక్షితంగా తీసుకురావాలని వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేయడం జరిగిందని వెల్లడించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ఆర్ఐ గ్లోబల్ కన్వీనర్ ప్రతి రోజు గల్ఫ్ లో ఉన్న పార్టీ నాయ కులతో మాట్లాడి మన ప్రవాసాంధ్రుల క్షేమ సమాచారం తెలుసుకుంటున్నారని తెలిపారు. కడప, రాజంపేట ఎంపీలు వై.యస్. అవినాష్ రెడ్డి, పి. మిథున్ రెడ్డిలు కూడా టెలిఫోన్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విదేశాంగ శాఖ మంత్రి తో మాటాడుతున్నామన్నారని పేర్కొన్నారు. బహరైన్ కన్వీనర్ ఓర్సు నాగ రాజు, మహిళా నాయకురాలు లక్ష్మి, నూతన కమిటీ సభ్యులు వి. శివరాజు, శివారెడ్డిలు మాకు వసతి భోజన సదుపాయాలు కల్పించాలని చెప్పారు. మన రాష్ట్ర ప్రవాసాంధ్రులు అందరూ క్షేమంగా ఉన్నారని వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

అంగన్వాడీ మహిళల పట్ల ప్రభుత్వ తీరు అమానుషం

వేంపల్లి.మార్చి 04 ప్రభాతవార్త

అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు విజ యవాడ ధర్నా చౌక్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అంగన్వాడీ మహిళలపై కూటమి ప్ర భుత్వం ప్రవర్తించిన తీరు అమానుషం, అమానవీ యం, ఆటవికం, అనాగరికం అని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా క్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. తెల్లవారు జామున నాలుగున్నర గంటల సమయంలో మగ పోలీసులు వచ్చి శిబిరాన్ని ధ్వంసం చేయడం శోచనీయమన్నారు. ఈ సంద ర్భంగా అంగన్వాడీ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీ రాణి ఎడమ చేయి విరగడం, మరికొందరు గాయాలపాలు కావడం, బ్యాగులు, సెల్ఫోన్లో పోగొట్టుకోవడం దురదృష్టకరమన్నారు. దాదాపు 1000 మంది అంగన్వాడీ మహిళలను అరెస్ట్ చేశారు అన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీ లను అమలు చేయమని మాత్రమే అంగన్వాడీ మహిళలు అడుగుతున్నారు. కనీస వేతనాలు నెలకు రు 26000 ఇవ్వాలని, పదవి విరమణ తర్వాత గ్రా చ్యూటీ ఇవ్వాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ అంగన్వాడీ సెంట్రల్ గా మార్చాలని, ఖాళీగా ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమకు కూడా అమలు చేయాలని అంగన్వాడీ మహిళలు చేస్తున్న డిమాండ్లు సహేతుకమైనవి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి అంగన్వాడీ మహిళల న్యాయమైన సమస్య లను పరిష్కరించాలని, అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయాలని, కేసులు పెట్టవద్దని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఈ ఉపాధ్యాయుని త్యాగం మరువ లేనిది

సుండుపల్లె, మార్చి04, ప్రభాతవార్త :
మండల పరిధిలోని కస్తూరిబాయ్ గాంధి బాలిక విద్యాలయం సుండుపల్లె నందు 10 వ తరగతి చదువు తున్న బడుగు బలహీన వర్గాల 40 మంది బాలబాలికలకు ఉత్తమ ఉపాధ్యాయుడు నంద్యాల. వెంకట సిద్దయ్య పరీక్ష ఎ ాామాగ్రి ని 4 వ తేది బుధవారం ప్రిన్సిపాల్ శివశృతి ఆధ్వర్యంలో సుండుపల్లె సర్కిల్ ఇన్స్పెక్టర్ మస్తాన్ ఎస్సై ఎస్ ఎం డి హుస్సేన్ ఎం ఇ ఒ2 రవీంద్ర నాయక్ చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సి ఐ మస్తాన్ మరి యు ఎస్సై హుస్సేన్ విద్యార్థిని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ చిన్న వయసులోనే సైబర్ నేరల పట్ల అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా ముబైల్ ఫోన్లు, శోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు పాటిస్తూ అపరచి తులపై నమ్మకము ఉంచకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఏం ఇ ఒ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ మండలంలో ఉన్న 8 ప్రభుత్వ పాఠశాలలో 500 మంది పిల్ల లకు విద్యాసాగ్రీ అందజేయడం కోసం తన పిబ్రవరి నెల జీతం మొత్తం అం దచేయడం ఆయన దాన గుణానికి నిదర్శనం అని కొనియాడారు.

ద్విచక్రవాహనాలు ఢీ వ్యక్తి మృతి

చిన్నమండెం మార్చి 4 ప్రభాతవార్త
మండలంలోని రాయచోటి మదనపల్లి రహదారి లో దేవగుడిపల్లి గ్రామం పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు దేవగుడిపల్లి కి చెందిన తిరుపతి ఆంజనేయులు చిన్నమండెం నుండి దేవగుడిపల్లి కి ద్వి చక్రవాహనం లో వెళుతుండగా అదేసమయంలో రాయచోటి వైపు నుంచి చిన్న మండెం వైపు ద్విచక్రవాహనం లో వెళ్తున్న జయచంద్రారెడ్డి వాహనాలు ఢీకొ న్నాయి. ఈ ప్రమాదంలో ఇరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దేవగుడిపల్లి కి చెందిన ఆంజనేయులు (78) మృతి చెందాడు. జయచంద్రారెడ్డి కడప ఆసు పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు యస్ ఐ సుధాకర్ తెలిపారు.

ప్రమాద భీమా పరిహారం అందజేత

దువ్వూరు, మార్చి 04, ప్రభాతవార్త:

మండల పరిధి లోని గుడిపాడు గ్రా మంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ప్రమాద బీమా చెక్కును బ్యాం కు మేనేజర్ నాగేశ్వర రావు అందజేశారు అ నంతరం ఆయన మాట్లాడుతూ గుడిపాడు గ్రామానికి చెందిన ఎర్రబల్లె మహ బూబ్ బాషా కుటుంబానికి సంబంధించిన ఈ చెక్కును అందజేశామన్నారు. గతంలో వీరు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద 436 రూపాయలు చెల్లించడంతో ప్రమాదవశాత్తు మరణించడంతో ఈ భీమా అంద జేశాం అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రమాద బీమా యోజన పథకాన్ని అలాగే సు రక్ష యోజన పథకాన్ని చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రశాంతి, సుధీర్ బాబు, పవన్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో వ్యాస రచన పోటీలు

కలసపాడు, మార్చి 4 ప్రభాతవార్త:
అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం స్థానికస్తూ ర్బా పాఠశాలలో మహిళా సాధికరత అనే అంశం పై వ్యాసరచన పోటి నిర్వ హించారు. గెలుపొందిన వారికి ఈనెల 8 వ తేదీన బహుమతులు డిస్ట్రిబ్యూట్ చేస్తామని కలసపాడు ఎస్ఐ సుభాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ రెడ్డి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమి సభ్యత్వ నమోదు

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 5, ప్రభాతవార్త
స్థానిక శివాలయం సెంటర్ నందు బుధవారం జనసేన నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ఈ యొక్క సభ్యత్వం ఉపయో గించుకోవాలని 10 వ తేదీ మంగళవారం వరకు శివాలయం సెంటర్ నందు సభ్యత్వ నమోదు కార్యక్రమం ఏర్పాటు చేయబడునని, ఎవరైనా వచ్చి సభ్య త్వం చేసుకోవచ్చన్నారు.. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు జనసేన నాయకులు రామాజి ప్రసాద్, అక్కిదాసరి రామారావు ఆధ్వర్యంలో శివ కళ్యాణ్ రెడ్డి, మం చి శివకుమార్, జిలాన్ భాషా, సంజీవ్, బాబ్జీ, మాదాసు మురళీ , లక్ష్మణ్ సింగ్, శంకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

రాయచోటి టౌన్ మార్చి 4 ప్రభాతవార్త

స్థానిక రాయచోటి అం బేద్కర్ సర్కిల్ దగ్గర డిగ్రీ కాలేజీ విశ్రాంత లెక్చరర్ నెల్లిపల్లి సిద్దయ్య రచించిన భారతదేశంలో ప్రజాస్వా మ్యం ఎక్కడుందో మీకు తె లుసా అనే పుస్తకాన్ని బ హుజన టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పల్లం రా మచంద్ర రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ షేక్ అబ్దుల్ రజాక్, ఎంఆర్పీఎస్ రాష్ట్ర కా ర్యదర్శి రామాంజనేయులు లాయర్ రెడ్డెయ్య బీటీఏ అన్నమయ్య జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఏవీ రమణ, ట్రెజరర్ సీవీ రమణ, జిల్లా ఉపా ధ్యక్షులు తేజ లతో కలిసి ఆవిష్కరించారు. ప్రజాస్వామిక భారతదేశంలో ఓటు హక్కు ద్వారా బహుజనులు ఏకమై ఏ విధంగా అధికారంలో భాగస్వామ్యం కావాలి వనరులలో వాటాను ఎలా పొందాలో ఈ పుస్తకంలో వివరించారని ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదివి అవగాహనాపెంచుకోవాలన్నారు. ఈ కా ర్యక్రమంలో రఘు నాథ, శ్రీరాములు, సోనేనాయక్, మేకా రామచంద్ర తదిత రులు పాల్గొన్నారు.

వాహనాదారులకు అవగాహన

కలసపాడు, మార్చి 4 ప్రభాతవార్త:
స్థానిక తెల్లపాడు క్రాస్ రోడ్డు దగ్గర కలసపాడు ఎస్సై సుభాన్ తన సిబ్బం ది తో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా నెంబర్ ప్లేట్ లేని వాహనాలు, మైనర్ పిల్లల డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రికార్డులు లేని వాహనా లను పై చలానాలు విధించారు. అనంతరం వాహనాదారులకుఅవగాహన క ల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు అజాముద్దీన్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

కలసపాడు, మార్చి 4 ప్రభాతవార్త:
దశాబ్ద కాలంగా పరిష్కారానికి నోచుకోక పెండింగ్ లో ఉన్న మోడల్ స్కూ ల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎఫ్ఇటిఓ(ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్) జాతీయ కార్యదర్శి పి.రమ ణారెడ్డి, ఎస్టీయు జిల్లా ఆర్థికకార్యదర్శి యు.సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నరసాపురం లోని ఏపీ మోడల్ స్కూల్ నందు ఇటీవల ఏఐఎఫ్ఇటిఓ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన పి.రమణారెడ్డికి అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా రమణారెడ్డి, సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో నా ణ్యమైన విద్యను అందించాలనే సదుద్దేశంతో ఏర్పాటుచేసిన మోడల్ స్కూల్స్ లో పనిచేసే టీచర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం కనప రుస్తుందన్నారు. ఏపీఎంఎస్ ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దిలీప్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ మోడల్ స్కూల్స్ లోని ఖాళీలను భర్తీ చేసి, యాక్షన్ ప్లాన్, పరీక్షల నిర్వహణ, విద్యాశక్తి తదితర కార్యక్రమాలతో తీరిక లేకుండా పని చేస్తున్న వారిపై పని ఒత్తిడిని తగ్గించాలన్నారు. చాలీ చాలని వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేత నాలు పెంచి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. విపరీతమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్న హిందీ మరియు తెలుగు పోస్టుల సంఖ్యను పెంచాల్సిన అ వసరం ఎంతైనా ఉందన్నారు. హాస్టల్ యందు ఉన్న పిల్లలకు కాస్మోటిక్ చార్జీలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సి పల్ సౌజన్య, వైస్ ప్రిన్సిపాల్ చంద్ర, సీనియర్ ఉపాధ్యాయులు బాలిరెడ్డి, సుబ్బరాయుడు తదితర ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పాలేటమ్మ జాతర

చిన్నమండెం మార్చి 04 ప్రభాతవార్త:
మండలంలోని కేశాపురం గ్రామం దేవళం పేట వద్ద మాండవ్య నది ఒడ్డున రాయచోటి మదనపల్లి ప్రధాన రహదారి పక్కన వెలసిన భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం పాలేటమ్మ జాతర నేడు అంగరంగ వైభవంగా జరద్నున్నట్లు ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. జాతర సందర్భంగా తుమ్మలగొంది గ్రా మం గొల్లపల్లిలో ఉన్న అమ్మవారి ని మంగళ వారం మంగళ వాయిద్యాల తో పల్లకిలో కేశాపురం గ్రామంలో ఊరేగించి దేవాలయం లో కొలువు తీర్చుతారు. అప్పటినుడి జాతర ప్రారంభమోతోంది. ఈ జాతర పీలేరు. రాయచోటి రెండు గ్రామాల మధ్య ఉండడంతో రెండు నియోజక వర్గాల పరిధిలో ని ప్రజలు వేలాదిగా తరలి వచ్చి అమ్మవారికి పూజలు చేస్తారు. మంగళవారం అమ్మవారికి బోనాలు సమర్పించి జంతుబలులిచ్చారు. గురువారం రాత్రి శుక్రవారం పగలు జాతర నిర్వహిస్తారు. మొక్కుబడులు ఉన్న భక్తులు చాందిని బండ్లు కట్టి ఊ రేగింపుగా వెళ్లి అమ్మవారి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సముస్కృతిక నృత్యాలు. చెక్కభజనలు భక్తులకు కనువిందు చేస్తాయి. జాతర సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు గట్టి ఏర్పాట్లు చేశారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

దువ్వూరు, మార్చి 04, ప్రభాతవార్త:

స్థానిక ఎంపీడీవో కా ర్యాలయంలోని సభా భవ న్‌లో బుధవారం ఉపాధి హామీ పనులపై సమీక్ష ని ర్వహించారు. ఈ సంద ర్భంగా ఎంపీడీవో సుబ్బా రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో శ్రామికుల సమీకరణ చేసి పనులు కల్పించాలన్నారు. అ లాగే మార్చిలోగా 100 రోజులకు దగ్గరగా ఉన్న శ్రామికులను గుర్తించి వారిని వంద రోజులు పని చేసే విధంగా చూడాలన్నారు. మినీ గోకులాలు పూర్తి చే యించాలన్నారు. అలాగే ఉద్యానవన పంటలకు సంబంధించిన రైతులను గు ర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మీనారాయ ణ, ఈసీ ఇందిరా ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మల్లూరమ్మ జాతర

చాందిని బండ్లను ప్రారంభించిన సుగవాసి ప్రసాద్ బాబు

చిన్నమండం, మార్చి 04 ప్రభాత వార్త :
మండల పరిధిలోని చాకిబండ బలిజపల్లె మరియు కురవపల్లె గ్రామాల్లో బుధవారం రాత్రి శ్రీ మల్లూరమ్మ జాతర అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు బుద్దా శ్రీనివాసులు, గౌని మల్లికార్జున ఆ హ్వానం మేరకు రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చేరుకున్న ప్రసాద్ బాబుకి గ్రామస్తులు, తెలుగుదే శం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు గజమాలతో ఘనస్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన చాందిని బండ్ల వద్ద ప్రత్యేక పూ జలు నిర్వహించి, జాతర ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రా మస్తులు ఉత్సాహంగా ఆయన్ని చాందిని బండిపై ఎక్కించి ముందుకు నడి పారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. గ్రామ దేవతల జా తరలు గ్రామాల్లో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని, మన సంప్ర దాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్య లో భక్తులు పాల్గొన్నారు.

శేష వాహనంపై విహరించి న లక్ష్మీ సమేత

పెద్దమండెం మార్చి 4 ప్రభాతవార్త

మండలంలోని వాపేపల్లి పంచాయతీ లో ఏకశిలగుట్టపై నిర్మించబడిన లక్ష్మీనరసిం హస్వామి ఉత్సవాల ప్రారంభమ య్యాయి ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మీనరసింహుడు శేష వాహనంపై విహరించారు చే కుష్యవతి నదీతీరాన దారు మూర్తిగా ప్రతిష్టించిన లక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు ఉత్సవాల్లో నేడు జరుగుతున్న శేష వాహనంపై ఊరేగింపును ప్రజలు మంగళ వాయిద్యాలు మధ్య వివిధ రకాల పూల అలంకరణలతో పూజించి చదివింపులు కావించారు లక్ష్మీనరసింహస్వామి ని నమ్ముకున్న వారికి మేలు జరుగుతుందని ప్రజల విశ్వాసం దీంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని లక్ష్మీ నరసింహ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు

పరీక్షలు తనిఖీ చేసిన వెంకట సుబ్బారెడ్డి

పెండ్లిమర్రి, మార్చి 4, ప్రభాతవార్త:
మండలంలో బుధవారం అక్షరాంధ్ర కార్యక్రమం పరీక్షలు నందిమండలం, వెల్లటూరు గ్రామాల్లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అభ్యాసకులు రాస్తున్న ప్రీఫైనల్ ఎగ్జామ్ డీడీఓ అడల్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకట సుబ్బా రెడ్డి పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకట సుబ్బమ్మ, సీసీ గోపాల్, డ్వాక్రా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పొలతల శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

పెండ్లిమర్రి, మార్చి 4, ప్రభాతవార్త:
పొలతల శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్రి అనంతరం శాశ్వత హుండీలను దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సూపరింటెండెంట్ శ్రీమతి రమణమ్మ పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వహణాధికారి మూడే కృష్ణా నాయక్, ఆలయ ఛైర్మన్ సిరిగిరెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో పాలకమండలి సభ్యులు, భక్తులు, సేవకులు, దేవస్థాన సిబ్బంది లెక్కించడం జరిగింది. మల్లేశ్వరస్వామి, శ్రీ అక్కదేవతల, శ్రీబండెన్నస్వామి, శ్రీ పుట్ట ఆంజనేయస్వామి శాశ్వత హుండీలు మరియు అన్నదానం హుండీలను లెక్కించగా రూ.31,47,640 రావడం జరిగిందన్నారు. మిక్స్‌డ్ బంగారం సుమారు 0.21 గ్రాములు, మిక్స్‌డ్ వెండి 2.599 గ్రాములు రావడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి మూడే కృష్ణానాయక్ తెలిపారు.

కొత్త పెన్షన్లు విస్మరించిన ప్రభుత్వం

పోరుమామిళ్ల రూరల్, మార్చి4 ప్రభాత వార్త:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న కొత్త పెన్షన్లను మంజూరు చేయకపోవడం సిగ్గుచేటని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, పోరుమామిళ్ల మండల అధ్యక్షులు అన్వర్ మండిపడ్డారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ డబ్బా కొట్టుకుంటున్న ప్రభుత్వం, కొత్త పెన్షన్ల అమలులో వైఫల్యం చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన నాలుగు వేల రూపాయల పెన్షన్‌ని ప్రతినెలా చూపిస్తూ, భర్త చనిపోతే ఆ పెన్షన్ భార్యకిస్తూ సంబరపడుతున్న కూటమి ప్రభుత్వం కొత్త పెన్షన్లు ఇప్పటివరకు మంజూరు చేయకపోవడం చాలా దారుణమన్నారు. ప్రతినెలా పెన్షన్లను వీధి వీధి తిరుగుతూ ఫోటోలకు ఫోజులు ఇస్తున్న కూటమి ప్రభుత్వం, 50 సంవత్సరాలకే బీసీలకు పెన్షన్ అని చెప్పి మభ్యపెట్టిందని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడైనా చెప్పిన మాట ప్రకారం కొత్త పెన్షన్ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

యర్రగుంట్ల మార్చి 4, ప్రభాతవార్త:

యర్రగుంట్ల రాణివనం నందు నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం యర్రగుంట్ల మండలం కూటమి ఇన్చార్జ్ మధుసూదన్ రెడ్డికి టీడీపీ యువ నాయకుడు సయ్యద్ సలీం ఓ వినతి పత్రం అందజేశారు. వీధిలో దెబ్బతిన్న సిమెంట్ రోడ్లు, వీధి దీపాలు మరమ్మత్తులు చేసేలా చర్యలు తీసుకోవాలని గతంలో ఏటీఎం ఉన్నప్పుడు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేదని ఇప్పుడు రానివ్వనంలో ఏటీఎం లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆ వినతిలో కోరారు. త్వరలో కాలనీని సందర్శించి సమస్యలను పరిష్కరిస్తామని మధుసూదన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు సలీం పేర్కొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

యర్రగుంట్ల మార్చి 4, ప్రభాతవార్త:

పట్టణంలోని 2025, 26 ఆర్థిక సంవత్సరం సంబంధించి ఇంటి, తాగు నీటి, వ్యాపార సముదాయాల పన్నులు చెల్లించని వారి నీటి, విద్యుత్ కనెక్షన్ తొలగించి షాపులను సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ శేషఫణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన ఆదేశాలతో పట్టణంలో ఆస్తి పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పన్ను చెల్లించని యజమానుల నుంచి స్పందన కొరవడటంతో అధికారులు నోటీసులు జారీచేసి, నీటి కనెక్షన్ తొలగించారు.

అద్దె చెల్లించకుండా వేధిస్తున్నట్లు ఎస్పీకి ఫిర్యాదు

మదనపల్లెక్రైమ్, మార్చి 4 ప్రభాతవార్త.

నివాసముంటున్న ఇంటికి, వ్యాపారం నిర్వహిస్తున్న హోటల్‌కు అద్దెలు చెల్లించకుండా, ఖాళీ చెయ్యకుండా పార్టీని అడ్డం పెట్టుకుని దౌర్జన్యాలకు దిగుతున్నాడంటూ బాధితులు బుధవారం అడిషనల్ ఎస్పీ వెంకటాద్రికి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక నీరుగట్టువారిపల్లి రామాలయం వీధిలో మునిరత్నంకు చెందిన ఇంటిని నెలకు రూ.8 వేలకు అద్దెకు తీసుకుని కొన్ని నెలలుగా అద్దె చెల్లించలేదని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇప్పటివరకు రూ.3.4లక్షలు అద్దె బకాయి ఉన్నాడని, డబ్బు చెల్లించడు, ఖాళీ చెయ్యమంటే దౌర్జన్యానికి దిగుతున్నాడని, న్యాయం చేయాలని అభ్యర్థించాడు. గొల్లపల్లె రింగ్‌రోడ్డులో సుధాకర్‌రెడ్డికి చెందిన భవనంలోని మొదటి రెండు అంతస్తులను హోటల్ నిర్వహణ కోసం అద్దెకు తీసుకున్నారు. అయితే, అప్పటి నుండి ఇప్పటి వరకు సుమారు రూ. 45 లక్షల అద్దె బకాయి పడ్డారు. అద్దె అడిగితే తన తమ్ముడుతో కలిసి దౌర్జన్యం చేస్తున్నాడని, పార్టీ అండతో భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని సుధాకర్ రెడ్డి ఎస్పీకి వివరించారు. న్యాయం చేయాలని ఎస్పీని అభ్యర్థించాడు. విచారించి తగు న్యాయం చేస్తానని ఎస్పీ ఇరువురికి హామీ ఇచ్చారు.

పాత కక్షలతో ఇద్దరి వ్యక్తులపై దాడి

మదనపల్లెక్రైమ్, మార్చి 4 ప్రభాతవార్త.

పాత కక్ష్యలతో ఇద్దరు వ్యక్తులపై 15 మంది కలిసి మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచిన సంఘటన మంగళవారం మదనపల్లి పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మదనపల్లె పట్టణం శేష్ మహల్ ప్రాంతంలో నివాసం ఉన్న ప్రసాద్‌కు అంజినేయస్వామి గుడివీధిలో ఉంటున్న ఫరీద్, ఎన్ వి ఆర్ లేఔట్ ప్రాంతంలో ఉంటున్న గిరీష్ బాబు అలియాస్ బాబీలతో పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో గిరీష్ బాబు, ఫరీద్ తన స్నేహితులతో మంగళవారం రాత్రి మున్సి పల్ కార్యాలయం వద్ద 15 మంది కలిసి ప్రసాద్‌ను కొడుతుండగా మేదరవీధికి చెందిన సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బుకు అక్కడికి చేరుకుని అడ్డుకోవడంతో ఇద్దరిపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో ప్రసాద్, సుబ్రహ్మణ్యంలు గాయపడ్డారు. రాత్రి పెట్రోలింగ్‌లో ఉన్న ఎస్ఐ చంద్రమోహన్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకోవడంతో దాడికి పాల్పడిన యువకులు పరారయ్యారు. గాయపడిన బాధితులను పోలీసులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు యువకులకు గాయాలు

మదనపల్లెక్రైమ్, మార్చి 4 ప్రభాతవార్త.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. అంగళ్లు గ్రామం, చేనేత నగర్ కు చెందిన రామాంజులు, మారుతీనగర్ కు చెందిన సురేష్ లు ద్విచక్ర వాహనంలో సొంత పనిమీద అంగళ్లుకు బయలుదేరారు. అంగళ్లు సమీపంలో ముందు వెళ్తున్న కారును అధిగమించే క్రమంలో అదే కారును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మదనపల్లెక్రైమ్, మార్చి 4 ప్రభాతవార్త.

కర్నాటక సరిహద్దు ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ముగ్గురు గాయపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. రాయల్పాడు ఎస్ఐ రామా కథనం మేరకు.. మదనపల్లె మండలం, బార్లపల్లెకు చెందిన అరుణ్ కుమార్, మనోజ్ లు సొంతపని మీద సమీపంలోని కర్నాటక బార్డర్‌లో ఉన్న రాయల్పాడుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వేరే ద్విచక్ర వాహనదారుడిని లిఫ్టు అడిగి స్వగ్రామంకు వస్తుండగా, అదే సమయంలో గుర్రంకొండ మండలం, మర్రిపాడుకు చెందిన బషీర్ బాష బెంగుళూరు నుంచి మదనపల్లె వస్తున్న కారు, మార్గమధ్యం లోని మదనపల్లి వీకలబైలు చెక్ పోస్టువద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్, ద్విచక్రవాహనం ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న బషీర్ బాష మృతి చెందగా, కారు డ్రైవర్ కోమాలోకి వెళ్లాడు. ద్విచక్రవాహనంలోని అరుణ్ కుమార్ తీవ్రంగా గాయపడగా, మనోజ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు గమనించి గాయపడిన అరుణ్ కుమార్, మనోజ్‌లను ఆటోలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రాయల్పాడు ఎస్ఐ రామా సిబ్బంది తో సంఘటనా స్థలానికి చేరుకుని కోమాలోకి వెళ్లిన కారు డ్రైవర్ ను శ్రీనివాసపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బషీర్ బాష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీనివాసపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నీటి తొట్ల ఏర్పాటు.

కడప మార్చి 4 ప్రభాతవార్త.

పెరుగుతున్న నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని జంతువుల కోసం నీటి తొట్టెను ఏర్పాటు చేయటం మంచి విషయమని ప్రధాన ఆచార్యులు రవికుమార్ తెలియజేశారు. వైస్ ప్రిన్సిపల్ రమేష్ మాట్లాడుతూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని ఇటువంటి నీటితొట్ల ఏర్పాటు చేయటం జీవ జాతులకు ఎంతో ఉపయోగకరన్నారు. జంతు శాస్త్ర విభాగాధిపతి పి.రవిశేఖర్ మాట్లాడుతూ వీలున్న ప్రతి చోటా జంతువులకి ఆహారము నీటి వనరులను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ఎండాకాలంలో అనేక జీవ జాతులను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, బయపు రెడ్డి, నాగేంద్ర కుమార్ నవనీశ్వర్ రెడ్డి హనోక్, సత్యనారాయణ రెడ్డి తదితరులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

యానాదులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

కెవిపల్లి పీలేరు, మార్చి 4 ప్రభాతవార్త:

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణప్ప

కెవిపల్లి మండలం, మఠంపల్లి గ్రామం కలికిరివాండ్లపల్లి గ్రామంలో నివసిస్తున్న యానాదుల పేద కుటుంబాలకు ఇంటి స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలని గత మూడు సంవత్సరాలుగా యానాదులు తమ నివాస హక్కుల కోసం ఆందోళనలు చేస్తూ, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తున్నప్పటికీ స్థానిక రెవెన్యూ అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం బాధాకరమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోపు కృష్ణప్ప అన్నారు. ఈ సందర్భంగా కృష్ణప్ప మాట్లాడుతూ భూమిలేని పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు భూమి ఇస్తామని ప్రభుత్వం హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం దురదృష్టకరం అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్ వెంకటేష్, మహిళా సమాఖ్య నాయకురాలిగా కవిత తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా అవగాహన

బద్వేలు అర్బన్, మార్చి 4 , ప్రభాతవార్త

మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ నగర్ సచివాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బద్వేల్ అర్బన్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ చిరంజీవిలు హాజరై మహిళా సాధికారతపై ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మహేశ్వర్ రెడ్డి హైస్కూల్ బాలికలకు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, బాలిక విద్య ప్రాముఖ్యత, అత్యవసర సేవల నంబర్లు 112, 1098 వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే సచివాలయ మహిళా పోలీస్ సిబ్బంది బాలికలకు బాల్య వివాహాల నివారణ, హెల్ప్‌లైన్ నంబర్లు 112, 1098, 1930 మరియు సైబర్ సంబంధిత సమస్యలపై సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గాంధీ నగర్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ రథం ప్రారంభోత్సవం

ఒంటిమిట్ట మార్చి.04 ప్రభాతవార్త

ఎంపీడీవో కార్యాలయంలో చెత్తను సేకరించే నూతన స్వచ్ఛ రథాన్ని బుధవారం పంచాయతీ అధికారులు ఎంపీడీవో సుజాతతో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చమర్తి. జగన్మోహన్ రాజు హాజరయ్యారు. అనంతరం ఆయన నూతన స్వచ్ఛ రథాన్ని ప్రారంభోత్సవం చేశాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పారిశుద్యాన్ని మెరుగు పరచడమే కాకుండా స్వచ్ఛమైన వాతావరణం కలిగి ఉండేందుకు ప్రభుత్వము స్వచ్ఛ రథం అనే పేరుతో నూతన వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నాడు. ఈ విధానం వల్ల గ్రామాల్లోని పారిశుద్ధాన్ని మెరుగుపరచుకోవచ్చని మంచి వాతావరణాన్ని పొందవచ్చని తమ ఆరోగ్యాలను బాగుపరచుకోవచ్చన్నాడు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చాడు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట మండల టిడిపి అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ఒంటిమిట్ట జడ్పిటిసి సభ్యుడు అద్దులూరి. ముద్దుకృష్ణారెడ్డి, ఏవన్ కాంట్రాక్టర్ వెంకటరమణ, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ లో అంతరాయం

ముద్దనూరు,మార్చి 04 ప్రభాతవార్త:

తిమ్మాపురం ఫీడర్ పరిధిలోని వ్యవసాయ విద్యుత్తు ను గురువారం నాడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రకటన తెలిపారు. తిమ్మాపురం ఫీడర్ పరిధిలో ని తిమ్మాపురం కొత్తపల్లి నర్సంవారిపల్లె రాజు గురువాయుపల్లె పెనికలపాడు ఈ 6 గ్రామాల రైతులకు వ్యవసాయ విద్యుత్ లైన్ల మరమ్మత్తులు, విద్యుత్ నూతన స్తంభాల ఏర్పాటులో భాగంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పుకార్లు షికారులై.. !

గాలివీడు, మార్చి 4(ప్రభాతవార్త):

ఇరాన్, ఇజ్రాయిల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో చమురు కొరత ఏర్పడిందంటూ సోషియల్ మీడియాలో పుకార్లు షికార్లుగా వ్యాపించాయి. ఈ ప్రచారంతో గాలివీడులోని పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు ఒక్కసారిగా బారులు తీరారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ బంక్ వద్ద రాత్రి సమ యంలో భారీగా వాహనాలు క్యూకట్టాయి. కొందరు వాహనదారులుఅదనంగా టిన్నులు, క్యాన్లలో పెట్రోల్, డీజిల్ నింపుకుని తీసుకెళ్లడం కనిపించింది. అ యితే ఈ విషయంపై బంకుల యాజమాన్యం స్పందిస్తూ చమురు కొరత అనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. పెట్రోల్, డీజిల్ సరఫరా సా దారణంగానే కొనసాగుతోందని, ప్రజలు పుకార్లను నమ్మి ఆందోళన చెందాల్సి న అవసరం లేదన్నారు. అధికారులు కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండి వా స్తవ సమాచారాన్నే నమ్మాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ప్రత్యేక అధికారి

తొండూరు మార్చి 4 ప్రభాతవార్త:

మండలంలోని శనగ మరియు కందుల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు కేంద్రంలోని తేమ శాతం చూసే మిషన్, సంచుల లభ్యత మరియు కొనుగోలు విధానాన్ని పరిశీలించారు. అలాగే నాణ్యతా ప్రమాణాలను పాటించి రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని శనగ కనుగోల కేంద్రం ఇంచార్జ్ జి. గంగా ప్రసాద్ రెడ్డి మరియు సిబ్బందికి సూచించారు. శనగలు అమ్ముతున్న రైతుల నుండి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు 2025 రబీ లో జరిగిన కంది పంట షెడ్యూలింగ్ తొందరగా పూర్తి చేసి త్వరలో కందులను కొనుగోలు చేయాల్సిందిగా కోరారు కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే రాజు, గ్రామ వ్యవసాయ సహాయకుడు సతీష్ మరియు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

మైదుకూరు, మార్చి 04, ప్రభాతవార్త:

పట్టణంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోగలరు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్వర డిగ్రీ కళాశాల, ప్రిన్సిపల్ దుగ్గిరెడ్డి ఓబుల్ రెడ్డి తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు నిరుద్యోగులు ముందుగా తమ పేరు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ మేళాలో పాల్గొనే నిరుద్యోగులు ఫార్మల్ డ్రెస్, రిజిస్ట్రేషన్ నమోదు, బయోడేటా, సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలన్నారు. 8179643625 9398347860 సంప్రదించాలన్నారు.

దళితుల భూములపై బూచోళ్లు

సిద్ధవటం ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:

దళితుల భూములపై పెత్తందారుల బూచోళ్ళు దౌర్జన్యాలు, ఆగడాలు చేసి దళితుల రైతులకు మద్దతు తెలిపిన వారి పైన తప్పుడు కేసులు వెనుక బూచోళ్ళ హస్తం ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మండిపడ్డారు. మాధవరం గ్రామంలోని ఎస్‌కేఆర్ నగర్ నందు బుధవారం ఆయన మాట్లాడుతూ సోమశిల మునక ప్రాంతానికి చెందిన దళితులకు పట్టాలు మంజూరు చేయకుండా అన్యాయం చేశారని కొంతమంది స్థానికులు పెత్తందారుల బూచోళ్ళతో చెయ్యి కలిపి దళితుల భూములు కాజేయడానికి దళితుల భూములపై దోబూచులాట ఆడుతున్నారన్నారు. దళితుల భూముల పట్టాలు మంజూరు కోసం త్వరలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి దళిత రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

సిద్ధవటం మార్చి 4 ప్రభాతవార్త :

సిద్ధవటం పరకోటలో వెలసిన సయ్యద్‌షా బిస్మిల్లాషా ఖాద్రి 261వ గంధ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించినట్లు ముత్తవలి సయ్యద్ మగ్దూమ్ పీర్ ఖాద్రి తెలిపారు. ప్రతి యేటా పవిత్ర రంజాన్ మాసంలో 14వ ఉపవాసం రోజున గంధ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా దర్గాలో గంధాన్ని అర్పించి ఫాతేహాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఖాజాపీర్ ఖాద్రి, సయ్యద్ రఫీ, సయ్యద్ ఖాజాపీరాన్, సయ్యద్ ఇమ్రాన్, సయ్యద్ రిజ్వాన్, సయ్యద్ వసీమ్, సయ్యద్ నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

సిద్ధవటం మార్చి 4 ప్రభాతవార్త :

సిద్ధవటం మండలం మాధవరం1 గ్రామంలోని రోడ్డు నెంబర్ 13 బస్టాండు నందు మనఊరి కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఎస్సై హారిక చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై హారిక మాట్లాడుతూ మనఊరికోసం స్వచ్ఛంద సంస్థ వారు చాల మంచి కార్యక్రమం చేస్తున్నారని ఎండలను దృష్టిలో ఉంచుకుని మండలంలో ఎవరైనా ముందుకొచ్చి ఇలాంటి చలి వేంద్రాలు ఏర్పాటు చెయ్యాలని వారికి మా వంతు సహకారం కూడా వుంటుందని తెలిపారు. మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ అవ్వారు రవి శంకర్ మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్టిలో వుంచుకుని దాతల సహకారంతో వరుసగా 2వ సంవత్సరం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అవ్వారు జానకిరామయ్య, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పుత్తా రామచంద్రయ్య, సంస్థ సభ్యులు ఉప్పల రామక్రిష్ణ, పుత్తా సుధీర్, పుత్తా శ్రీనివాసులు, సామల చెంగయ్య, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రతినిధి దేరంగుల శ్రీకాంత్, పెంచలయ్య, సుబ్బారాయుడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికి జగన్ రాయలసీమ ద్రోహి

టిడిపి పట్టణ అధ్యక్షులు అరుణ్‌తేజ్

మదనపల్లె, మార్చి 4 ప్రభాతవార్త :

సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

రాయలసీమ ద్రోహి ముమ్మాటికి జగనేనని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు నాదెళ్ళ అరుణ్‌తేజ్ జనరల్ సెక్రటరీ రామాంజనేయులు తెలిపారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధికోసం ముఖ్యమంత్రి చంద్రబాబు దృఢసంకల్పంతో పనిచేస్తున్నారన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో జగన్ రాయలసీమకు అన్యాయం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 198 సాగునీటి ప్రాజెక్టులకు ప్రీ-క్లోజర్ ఇస్తే వాటిలో 102 ప్రాజెక్టులు రాయలసీమలోనే ఉన్నాయని గుర్తుచేశారు. డ్రిప్ ఇరిగేషన్ రద్దు చేసి రైతులకు తీవ్ర నష్టం కలిగించారన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో అనుమతులు లేకుండా ప్రాజెక్టులు చేపట్టి ప్రజలను తప్పుదారి పట్టించారన్నారు. టిడిపి హయాంలోనే రాయలసీమకు అనేక ప్రాజెక్టులు తీసుకువచ్చిన ఘనత దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ సుబ్రమణ్యంరెడ్డి, టౌన్ సెక్రటరీ శంకర, శ్రీనివాసులు, శ్రీరాములు, ప్రకాష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు బకాయిలు సకాలంలో అందించాలి

సీనియర్ సిటిజన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిగోపాలక్రిష్ణ

మదనపల్లె, మార్చి 4 ప్రభాతవార్త :

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రభుత్వ పెన్షనర్లకు డిఏ బకాయిలు సకాలంలో అందించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.మునిగోపాలక్రిష్ణ తెలిపారు. బుధవారం మదనపల్లె సబ్‌ట్రెజరీ అధికారి నరేష్‌తో కలసి అసిస్టెంట్ సబ్ ట్రెజరీ అధికారి లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 32 మందికిగ 30నెలలుగా డిఏ అరియర్స్ అందడం లేదని తమ దృష్టికి రావడంతో ట్రెజరీ అధికారికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం డిఏ అరియర్స్‌ను విడుదల చేసినప్పటికి నిధులు కొరత వల్ల అందలేదని తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఏటిఓ, ఎస్‌టిఓలు పరిగణలోకి తీసుకొని విశ్రాంత పెన్షనర్లకు డిఏ అందించాలని కోరారు. వృద్ధాప్యంలో ఉన్న ప్రభుత్వ పెన్షనర్లకు సకాలంలో నిధులు అందకపోవడం వల్ల మానసిక ఇబ్బందులకు గురికావడంతో పాటు అనారోగ్యబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జగన్‌మోహన్, కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి పిసి.తిమ్మయ్య, అధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

నియోజకవర్గ పరిశీలకునిగా నరసింహారెడ్డి

ప్రొద్దుటూరు మార్చి 4 ప్రభాతవార్త

నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం చేసిన కృషిని గుర్తించి వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులుగా ఉన్న పోరెడ్డి నరసింహారెడ్డిని రాష్ట్ర కార్యదర్శిగా మరియు జమ్మలమడుగు నియోజకవర్గ పరిశీలకులుగా నియమిస్తూ రాష్ట్ర శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా పోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ తన కృషిని గుర్తించిన పార్టీ రాష్ట్ర శాఖ ప్రధానంగా మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి సజ్జల రామకృష్ణారెడ్డికి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి జిల్లా అధ్యక్షులు పి రవీంద్రనాథ్ రెడ్డికి స్థానిక మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో ఉంటూ పార్టీ అభివృద్ధికి పాటుపడతానన్నారు.

ఏడుగురు జూదారులు అరెస్ట్

ములకలచెరువు, మార్చి 4, ప్రభాతవార్త

7మంది జూదారులను అరెస్ట్ చేసినట్లు ములకలచెరువు ఎస్సై ప్రతాప్ తెలిపారు. మంగళవారం మండలంలోని కోనేటివారిపల్లి పంచాయతీ, దాసెట్టివారిపల్లి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై ప్రతాప్ తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడు మంది జూదరుల అరెస్ట చేసి వారి నుంచి రూ.11,210 నగదు, నాలుగు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం చేసినట్లు తెలిపారు.

తప్పనిసరిగా ఫీవర్ సర్వే చేపట్టాలి

మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు

ములకలచెరువు, మార్చి 4, ప్రభాతవార్త

గ్రామాల్లో తప్పనిసరిగా ఫీవర్ సర్వే చేపట్టాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. బుధవారం ములకలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సబ్ యూనిట్ పరిధిలోని హెల్త్ అసిస్టెంట్లతో సమీక్ష జరిపారు. విజుతీదీదిశ కార్యక్రమం అమలు స్థితిగతులను సమీక్షిస్తూ ల్యాబ్ రికార్డులు, రక్త పూత నమూనాలు, రిజిస్టర్లు మరియు సంబంధిత పత్రాలను సమగ్రంగా పరిశీలించారు. ఫీవర్ కేసుల నుంచి సేకరించిన రక్త పూత నమూనాలు సమయానికి ల్యాబ్‌కు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో జ్వరం ఉన్న వ్యక్తుల నుండి తప్పనిసరిగా రక్త పూతలు సేకరించి, నిర్దిష్ట సమయానికి ల్యాబ్‌కు పంపించాలి అని స్పష్టం చేశారు. ఫీల్డ్ స్థాయిలో నిర్లక్ష్యం చేయరాదని, మలేరియా నియంత్రణలో రక్త పూతల సేకరణ అత్యంత ముఖ్యమని తెలియజేశారు. ప్రతి గ్రామంలో హౌస్ టు హౌస్ ఫీవర్ సర్వే నిర్వహించాలి. పాజిటివ్ కేసులు ఉన్నట్లయితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలి.

అంబరాన్నంటిన హోలీ సంబురాలు

రామసముద్రం మార్చి 4 ప్రభాతవార్త

సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల తడ్కల్ గ్రామంలో బుధవారం హోలీ పండుగ వేడుకలు అంబరాన్నంటాయి. చిన్న పెద్ద లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. సంతోషంగా జరుపుకున్నారు. మంగళవారం గ్రహణం ఉన్న సందర్భంగా ఈరోజు హోలీ పండుగ జరుపుకుంటున్నారు. గ్రామంలో ర్యాలీగా తిరుగుతూ సందడి చేశారు. యువకులు రోడ్లపైకి వచ్చి రంగులు చల్లుకుంటూ ఎంజాయ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు ఉన్నారు.

రిక్షాలను, ప్లాస్టిక్ డబ్బాలను అందజేత

రామసముద్రం, మార్చి 4 ప్రభాతవార్త

మండలంలోని గ్రామ పంచాయతీలకు బుధవారం మండల అధికారులు 15 చెత్త రిక్షాలను, తడి పొడి వ్యర్థాల కోసం ప్లాస్టిక్ డబ్బాలను పారిశుద్ధ్య కార్మికులకు అందజేశారు. సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాలను చెత్త రహిత గ్రామాలుగా మార్చటానికి స్వచ్ఛ భారత్ మిషన్ లో రాష్ట్ర ప్రభుత్వం ఈ చెత్త రిక్షాలను, ప్లాస్టిక్ డబ్బాలను అందజేశాయని తెలిపారు. వీటి ద్వారా ప్రాథమిక వ్యర్థాలను సంపద తయారీ కేంద్రాలకు తరలించడానికి పారిశుద్ధ్య కార్మికులకు ఉపయోగపడతాయని, కాలుష్య రహితంగా ఉంటాయని తెలిపారు. ఆకుపచ్చ రంగు డబ్బాలో తడి చెత్తను,నీలి రంగు డబ్బాలో పొడి చెత్తను వేరు వేయడానికి వీలుగా ఆకుపచ్చ, నీలి రంగులను సూచించారని తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డి గఫూర్, పంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయంలో బహిరంగ వేలం పాట

బ్రహ్మంగారిమఠం మార్చి 04 ప్రభాతవార్త

భూత భవిష్యత్ వర్తమాన కాల జ్ఞానాన్నీ రచించిన శ్రీ గోవిందామాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం లో మఠాధిపతి శ్రీ వీర దర్మజ వెంకటాద్రి స్వామి ఆదేశాల మేరకు బ్రహ్మంగారి ఆలయంలో కొబ్బరి చిప్పలు వసూలు చేసుకొనుటకు, పోలేరమ్మ గుడి దగ్గర టెంకాయలు అమ్ముకొనుటకు మరియు కొబ్బరిచిప్పలు వసూలు చేసుకొనుటకు, డార్మెటరి హల్ లాకర్ నకు వసూలు చేసుకొనుటకు, పాదరక్షలు భద్రపరచి వసూలు చేసుకొనుటకు, లెట్రిన్లు శుభపరచుకొని వసూలు చేసుకొనుటకు వివిధ రకాల వేలం పాటలను నిర్వహించామని ఆలయ మేనేజర్ ఈశ్వరయ్య చారి తెలిపారు. ఈ వేలం పాటలకు దేవాదాయ శాఖ రాజంపేట ఇన్స్పెక్టర్ జనార్థన్ పాల్గొన్నారు. ఈ వేలం పాటల ద్వారా 20262027 ఆర్థిక సంవత్సరం గాను బ్రహ్మంగారి ఆలయంకు 50 లక్షలు ఆదాయం వచ్చినట్లు మేనేజర్ ఈశ్వరయ్య చారి తెలిపారు.

అవయవ దానంపై అవగాహన కార్యక్రమం

ప్రొద్దుటూరు మార్చి 4 ప్రభాతవార్త

మార్చి 8న అవయవ దానంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తూ ఆసక్తి కలవారు పేర్లు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు కొవ్వూరు రమేష్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత కొవ్వూరు రమేష్ రెడ్డి పేర్కొన్నారు. అవయవ దానం చేసేందుకు ఇటీవల కాలంలో చాలామంది ఆసక్తితో వున్నా చేసే మార్గం తెలియదని, ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమ నిర్వహణ ప్రశంసనీయమన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు కొవ్వూరు రమేష్ రెడ్డి మాట్లాడుతూ అవయవ దానం చేయదలచిన ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఫాంలో సంతకం చేయాలని కోరారు. అనంతరం ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని సూచించారు. అవయవదానం చేసే వారికి ప్రభుత్వం తరపున ప్రోత్సాహం వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ట్రెజరర్ డాక్టర్ సురేష్ శ్రీనివాస్, డాక్టర్ త్యాగరాజ రెడ్డి పాల్గొన్నారు.

లైన్మెన్లు అందిస్తూన్న సేవలు అనన్యం

పీలేరు మార్చి 04 ప్రభాతవార్త:



సన్మాన గ్రహీతలతో సిబ్బంది

క్షేత్రస్థాయిలో లైన్మెన్లు విద్యుత్ వినియోగదారులకు అందిస్తూన్న సేవలు అనన్యమని ఏపీఎస్పీడీసీఎల్ పీలేరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై. చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. "లైన్మెన్ దివస్" కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ట్రాన్స్‌కొ డివిజనల్ కార్యాలయంలో, పీలేరు నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లైన్మెన్లను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఈఈ వై. చంద్రశేఖర్ రెడ్డి, పీలేరు, కలికిరి ఏడీఈలు అమీర్ బాష, ఎం. శివయ్య మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పనిచేసే లైన్‌మెన్ల గొప్ప సేవలను గుర్తించి, వారిని ప్రోత్సహించే ఒక ప్రత్యేక రోజు లైన్మెన్ దివస్ అని అన్నారు. లైన్మెన్ దివస్ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన పీలేరు సెక్షన్ లైన్మెన్ రవికుమార్, వాల్మీకిపురం సెక్షన్ లైన్మెన్ రవీంద్ర, గర్నిమిట్ట సెక్షన్ లైన్మెన్ రవీంద్ర, గుర్రంకొండ సెక్షన్ లైన్మెన్ రెడ్డప్ప రెడ్డి, కలకడ సెక్షన్ లైన్మెన్ నాగార్జున, పీలేరు రూరల్ సెక్షన్ అసిస్టెంట్ లైన్మెన్ నాగభూషణ్, కలికిరి సెక్షన్ నుంచి శేఖర్ బాబు లను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు రామ్మూర్తి, రాజశేఖర్, ఖాదర్ ఇలాహి, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోండి

కలికిరి, మార్చి 4, ప్రభాతవార్త:

జూనియర్ ఇంటర్మీడియట్ మరియు 5వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ నందు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న జిల్లా కన్వీనర్ ప్రధానాచార్యులు వై.సోమశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కలికిరి ఎంజేపీ లేపీబీసీడబ్ల్యూఆర్ స్కూలు (బాలికలు) నందు దరఖాసథుకు ఈ నెల 12వ తేదీ లోపు హెచ్‌టీటీపీఎస్://ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ నందు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9000715637, 7989445396 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

డ్రగ్స్ వద్దు బ్రో.. దేశమే ముద్దు

రాయచోటి మార్చి 4 ప్రభాతవార్త

యువత డ్రగ్స్ వంటి అలవాట్లకు దూరంగా ఉండి, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నమయ్య జిల్లా పోలీస్ యంత్రాంగం పిలుపునిచ్చింది. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు, రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ పర్యవేక్షణలో బుధవారం మసాపేటలోని శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో "ఈగల్ సెల్" ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, ఒక కుటుంబాన్ని, తద్వారా సమాజాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద డ్రగ్స్ రవాణా లేదా వినియోగం చేస్తే ఎదురయ్యే కఠినమైన శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు. దేశ భద్రతకు ముప్పుగా పరిణమించిన నార్కో పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. విద్యార్థులే స్వచ్ఛందంగా డ్రగ్స్ నియంత్రణలో భాగస్వాములు కావడానికి ఈగల్ క్లబ్స్ విశేషంగా కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న సుమారు 300 మంది విద్యార్థులు ఒకే స్వరంతో "డ్రగ్స్‌కు చెక్.. ఈగల్ తో సేఫ్!", "దేశాన్ని ప్రేమిద్దాం – డ్రగ్స్‌ను ద్వేషిద్దాం" అంటూ నినదించడం విశేషం. అనంతరం విద్యార్థులందరితో డ్రగ్స్ తీసుకోబోమని, ఇతరులను కూడా అటువైపు వెళ్లకుండా అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరి సెల్ ఫోన్లలో ఈగల్ సెల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్స్‌ను సబ్‌స్క్రైబ్ చేయించారు. దీని ద్వారా డ్రగ్స్ నివారణపై నిరంతరం అప్‌డేట్స్ పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి టౌన్ ఇన్‌స్పెక్టర్ బి.వి. చలపతి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కుళాయప్ప, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, శక్తి టీమ్ సభ్యులు మరియు ఈగల్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

మదనపల్లెక్రైమ్, మార్చి 4 ప్రభాతవార్త.

మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను యుద్ధప్రతిపాదికన పరిష్కరించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) వెంకటాద్రి పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మదనపల్లె, పుంగనూరు, చౌడేపల్లి, బి.కొత్తకోట, ములకలచెరువు, మదనపల్లె రూరల్ సర్కిళ్ల సిఐలు, ఎస్ఐలతో ఆయన నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు జరిగిన ఆయా పోలీస్ స్టేషన్లలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక కారణాలు లేదా ఇతర అడ్డంకులను తొలగించి, వెంటనే ఆ కేసులను క్లోజ్ చేయాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే నెల సమీక్ష నాటికి సరైన కారణం లేకుండా కేసులు పెండింగ్‌లో ఉంటే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి

ఆశావర్కర్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

సమావేశంలో మాట్లాడుతున్న మహిళలు

మదనపల్లె, మార్చి 4 ప్రభాతవార్త :

ఆశా, కమ్యూనిటి హెల్త్ వర్కర్లకు కనీసం వేతనం రూ.26వేలు చెల్లించాలని ఆశా కార్యకర్తల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయమ్మ, మొహిరున్నీసాలు తెలిపారు. సిఐటియు రాష్ట్ర కమిటి పిలుపుమేరకు ఈనెల 5న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమానికి బుధవారం బయలుదేరి వెళ్ళారు. జిల్లాలోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, వాల్మీకిపురం, గుర్రంకొండ, కురబలకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల ఆశా కార్యకర్తలు సిటిఎం రైల్వేస్టేషన్ ద్వారా విజయవాడకు వెళ్ళేందుకు వస్తుండగా ఆయా మండలాల్లో ఆశా వర్కర్లను పోలీసులు నిర్బంధించారు. పోలీసుల నిర్బందాలను లెక్కచేయకుండా కొందరు విజయవాడకు బయులుదేరారన్నారు. మాతాశిశు సంరక్షణ పేరుతో నియమించబడిన ఆశా వర్కర్లతో ప్రభుత్వం అన్ని పనులు చేయించుకుంటోందన్నారు. సర్వేల పేరుతో పనిభారాన్ని పెంచితోందన్నారు. ప్రభుత్వం స్పందించి కనీస వేతనం ఇవ్వకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉదృతం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు మంజుల, సుజాత, రమాదేవి, శ్రావణి, రాధమ్మ, జ్యోతిలు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదు

టిడిపి మాజీ ఇన్చార్జి డాక్టర్ జి వీర ప్రవీణ్ కుమార్ రెడ్డి

ప్రొద్దుటూరు మార్చి 4 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు మార్కెట్ యార్డులో నాఫెడ్ మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శనగల కొనుగోలు కేంద్రంలో టిడిపి నాయకులమని చెప్పుకునే రసూల్ గౌస్ సుధాకర్ లు రైతులను దోపిడీ చేస్తున్నారని, రైతులకు అన్యాయం చేస్తే తాను చూస్తూ ఊరుకోనని టిడిపి మాజీ ఇంచార్జ్ డాక్టర్ జివి ప్రవీణ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానంగా సెనగలు ఒక్కో బస్తాకు రెండు కేజీలు అదనంగా తూకం వేస్తూ రైతులకు అన్యాయం చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అంతేకాకుండా 50 కేజీల బస్తాకు హమాలీల మరియు ఇతర ఖర్చుల కింద రూ.45 వసూలు చేయాల్సింది ఉండగా రూ.200 వసూలు చేసి రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రైతుల కష్టాలు తెలిసిన స్థానిక ఎమ్మెల్యే వరదరాజు రెడ్డి ఉండగా పార్టీ పేరు చెప్పుకొని దోపిడీకి దిగడం దారుణమన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా అధికారులతో పాటు ఆ శాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులు రెడ్డికి ఆయన తమ్ముడు రాఘవరెడ్డికి తెలిసి ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో వైసిపి ప్రభుత్వంలో చేయని తప్పులకు తాను జైలుకు వెళ్లాలని ఈరోజు రైతుల నుంచి అక్రమ వసూలు ఆపకపోతే వారి న్యాయం జరిగేందుకు జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులు రెడ్డి ఈ అవినీతిపై అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు.

చేపల పెంపకం ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుంది

సుండుపల్లె ,మార్చి 04,ప్రభాతవార్త :

చేపల పెంపకం ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని టిడిపి మండల అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు తెలిపారు. సుండుపల్లి మండలం పెద్దినేని కాల్వ గ్రామపంచాయతీ బండ కాడ ఈడిగ పల్లి ఎగువ బాగానున్న అత్తా కోడళ్ళ చెరువు నందు 20 వేల చేప పిల్లలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు మాట్లాడుతూ చేపలు వదలడం వలన మండలంలోని ప్రజలందరికీ తక్కువ ధరకు చేపలను అందజేయవచ్చు అన్నారు. చేపలు తినడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. చేపలు పెంచి ఆర్థికంగా ముందడుగు వేయాలన్నారు. అనంతరం చేప పిల్లలను చెరువులోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బెస్తపల్లి సుధీర్ నాయుడు, ఓబులయ్య నాయుడు, మనోజ్ నాయుడు, ఫాతిమా, బొంకు నాగార్జున, సామిసేని ఈశ్వరయ్య, మంగిరి శీను, రాయవరం పాముల ఆనంద్, కిషోర్, బలిజపల్లి శివ, ఎయిర్టెల్ మధు, ఫాజిల్,ఫయాజ్, ఈడికిపల్లి గ్రామ ప్రజలు, బెస్త పల్లి గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్దల బోనాలు

చిన్నమండెం మార్చి 04 ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో మాండవ్య నది ఒడ్డున వెలసిన మల్లూరమ్మ దేవత జాతర సందర్భంగా భక్తులు బుధవారం ఉదయం భక్తితో అమ్మవారికి సిద్దల బోనాలు సమర్పించారు. అనంతరం పూజలు నిర్వహించారు.సంతానం లేని మహిళలు సిద్దల బోనాల వద్ద వరపడ్డారు. అమ్మవారికి పూజలు నిర్వహించారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చి జాతరలో పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 4 ప్రభాతవార్త

మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవము సందర్భముగా ప్రొద్దుటూరు తాలూకా ఏపీ ఎన్జీజిఓస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలను జేఏసీ చైర్మన్ మరియు ఏపి ఎన్జిజిఓస్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.రామసుబ్బయ్య యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. తదుపరి ఆటలలో లెమన్, స్పూన్, మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్, త్రో బాల్, హెయిర్ లో స్ట్రా, స్కిప్పింగ్, కబడ్డీ మొదలగు ఆటల పోటీలు ఎద్దుల వెంకట సుబ్బమ్మ బాలికల హైస్కూల్ పిఇటి బి.లక్ష్మీ దేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షులు జె.రామసుబ్బయ్య మాట్లాడుతూ ఈ పోటీలలో గెలుపొందినవారికి మార్చి 8వ తేదీన జరుగు ప్రపంచ మహిళ దినోత్సవము కార్యక్రమములో బహుమతులు అందజేయ బడునని అలాగే కార్యక్రమమునకు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతము చేయవలసిందిగా ప్రతి అక్కను, చెల్లిని కోరుతున్నామన్నారు.ఈ కార్య క్రమములో సెక్రెటరీ ఇ. ప్రమీల, అసోసియేట్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, ట్రెజరర్ సదాశివయ్య, వైస్ ప్రెసిడెంట్ నాగార్జున, వరప్రసాద్, జెఏసి కో కన్వీనర్ ఓంకార్, మహిళ జాయింట్ సెక్రెటరీ సుజాత, మహిళా వింగ్ చైర్మన్ వి.అరుణదేవి, కన్వీనర్ యన్.విజయేశ్వరి, సచివాలయ ఉద్యోగుల అధ్యక్షుడు కె.పీరయ్య మరియు ఉద్యోగినులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ ఆదాయంలో చరిత్రాత్మక రికార్డు

పులివెందుల, మార్చి 4 , ప్రభాత వార్త :

పులివెందుల మార్కెట్ యార్డ్ ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని మించి ఆదాయం సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకుంది. ఈ విజయానికి ఇంచార్జ్ బీటెక్ రవి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ప్రధాన కారణమని మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ తెలిపారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డ్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చైర్మెన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా ముఖ్యంగా గత మూడు సంవత్సరాలుగా మార్కెట్ యార్డ్‌కు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిగా చేరుకోలేకపోయరని 202324 ఆర్థిక సంవత్సరంలో రూ. 98 లక్షల లక్ష్యానికి రూ. 93 లక్షలు మాత్రమే వసూలయ్యాయనీ 2024,25లో రూ. 102 లక్షల లక్ష్యానికి రూ. 98 లక్షల వసూళ్లు వచ్చిందనీ అయితే 2025,26 ఆర్థిక సంవత్సరంలో రూ. 108 లక్షల లక్ష్యానికి గాను ఇప్పటికే రూ. 1,08,01,500 వసూలై లక్ష్యాన్ని మించామని వెల్లడించారు. లక్ష్య గడువు ముగియడానికి ఇంకా నెల సమయం ఉండగానే ఈ విజయాన్ని సాధించడం గర్వకారణమన్నారు. ఈ విజయానికి ప్రధాన కారకుడిగా బీటెక్ రవి ప్రోత్సాహం నిలిచిందని చెప్పారు. ఒక సమావేశంలో "లక్ష్యాన్ని చేరుకున్నప్పుడే పని చేసినట్టుగా భావించాలి" అని ఆయన స్పష్టం చేసిన మాటలు తమకు ప్రేరణగా మారాయన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి సలహాలు సూచనలు అందించారని, మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత ఎప్పటికప్పుడు సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, ఏడిఎం, కార్యదర్శి మరియు సిబ్బంది అందరి సహకారం వల్లే ఈ ఫలితం సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కమిటీ సెక్రెటరీ శ్రీధర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని టపాసుల దుకాణాలపై

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

తనిఖీలు నిర్వహిస్తున్న తహసిల్దార్, సీఐ

పీలేరు మార్చి 4 ప్రభాతవార్త:

మండలంలోని లైసెన్సులు కలిగిన టపాసులు గోదాములు నిబంధనలు పాటించని టపాసుల గోదాములపై చర్యలు తప్పవని పీలేరు తహసిల్దార్ శివకుమార్ ,సీఐ యుగంధర్ హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు కాపాడలేని టపాసుల దుకాణాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు రావడంతో బుధవారం తహసిల్దార్ పీలేరు మండల పరిధిలోని టపాసుల దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. బోడుమల్లి వారి పల్లి పంచాయతీ పరిధి కడప మార్గంలోని గోదాము, మొరవ వడ్డీ పల్లె వద్ద ఉన్న టపాసుల గోదాములను తహసిల్దార్ తనిఖీలు నిర్వహించారు. టపాసుల నిల్వలు, రికార్డులు, అగ్నిమాపక నివారణ పరికరాలు వాటి పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్, సీఐలు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న టపాసులు తయారీ కేంద్రాల్లో నిబంధనలు పాటించకపోవడంతో ప్రాణనష్టం జరుగుతుండడంతో టపాసుల గోదాములు వద్ద చట్టబద్ధ నిబంధనలు పాటిస్తూ దుకాణాలు నిర్వహించుకోవాలని తెలిపారు. అలాగే ప్రమాదకర రీతిలో విద్యుత్ తీగలు ఏర్పాటు చేయకూడదన్నారు. టపాసు బాక్సులు కుప్పలుగా కాకుండా రాక్ ఏర్పాటు చేసుకొని వాటిపైన టపాసు బాక్సులు పేర్చుకోవాలని ఆయన సూచించారు. నిబంధనల అతిక్రమిస్తే గోదాములను సీజ్ చేస్తామని తహసిల్దార్, సీఐ లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ యుగంధర్, అగ్నిమాపక కేంద్ర అధికారి భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ మురుగయ్య, వీఆర్వో సిద్దయ్య ,తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో సత్ఫలితాలు సాధించాలి

తంబళ్లపల్లె ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :

తంబళ్లపల్లె కస్తూరిబా గాంధీ గురుకులం లోని టెన్త్ క్లాస్ విద్యార్థినిలు పబ్లిక్ పరీక్షల్లో సత్ఫలితాలు సాధనకు కృషి చేయాలని హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్ ఆకాంక్షించారు. బుధవారం కస్తూర్బా గురుకులం లోని టెన్త్ క్లాస్ లోని 37 మంది విద్యార్థినిలకు పరీక్షల కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్ క్లాస్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి ఉత్తీర్ణత సాధించాలని ఉత్తేజపరిచి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. కస్తూరిబా గురుకుల ప్రిన్సిపల్ మాట్లాడుతూ టెన్త్ విద్యార్థినిలకు పరీక్షల కిట్ అందజేసిన హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్ తోబాటు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపి వారు చేస్తున్న సేవాభావం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ పంపిణీ కార్యక్రమంలో కస్తూరిబా బాలికల గురుకుల విద్యాలయ ఉపాధ్యాయులు కాంచన, దీప, సుమతి, మహాలక్ష్మి, శ్రీలక్ష్మి, హెల్పింగ్ మైండ్స్ సభ్యులు పురుషోత్తం, దినకర్, బషీర్, సిరాజ్, కిరణ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారత వారోత్సవాలు

కడప క్రైం, మార్చి 4, ప్రభాతవార్త:

అంతర్జాతీయ మహిళా దినోత్సవం–2026 పురస్కరించుకొని ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు మేరకు జిలా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో మార్చి 1 నుంచి 8 వరకు జిల్లాలో మహిళా సాధికారత వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మార్చి 4వ తేదీ బుధవారం జిల్లాలోని వివిధ పీఎస్ పరిధిలో మహిళ సాధికారత వారోత్సవాలలో భాగంగా పాఠశాల, కళాశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ వ్యాసరచన, పెయింట్ తదితర పోటీలతో పాటు విద్యార్థుల భాగస్వామ్యంతో ర్యాలీలు నిర్వహించారు. పోలీసు అధికారులు విద్యార్థులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. సమాజంలో మహిళల పాత్ర, రక్షణ, హక్కుల గురించి అవగాహన కల్పించడమే ఈ పోటీల ఉద్దేశమన్నారు. అనంతరం వ్యాస రచన పోటీలలో విజేతగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పోలీసు అధికారులు సైబర్ క్రైం, పోక్స్, గుడ్, బ్యాడ్ టచ్, బాల కార్మిక చట్టాలు, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు, ఆకతాయిల వేధింపులు, ర్యాగింగ్ నుంచి రక్షణ, సామాజిక మాధ్యమాల వినియోగం వంటి పలు మహిళా సంబంధిత నేరాలపై అవగాహన కల్పించారు. జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పరీక్షా మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

రాజంపేట మార్చి 4 ప్రభాతవార్త

రాజంపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యం లో బాలికొన్నత బాలికల హైస్కూల్లో 10 వ తరగతి విద్యార్థినీలకు పరీక్షల మెటీరియల్ పంపిణీ చేశారు. స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో గురువారం జరిగిన కార్యక్రమంలో దాదాపు 120 మంది విద్యార్థినీలకు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ పరీక్ష పాడ్,స్కేల్, పెన్,పెన్సిల్స్,రబ్బర్, మెండర్ మొదలగు వస్తువులు పంపిణీ చేసి పరీక్షల్లో ఏ విధంగా ఉత్తమ మార్కులు తెచ్చుకోవచ్చునో లయన్స్ క్లబ్ నాయకులు సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్ అతిగారి కృష్ణ, వేంగిపురం శ్రీనివాస్, లక్ష్మాపురం వెంకటసుబ్బయ్యల సహకారంతో ఈ మెటీరియల్ పంపిణీ చేసినట్లు అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, గీతాంజలి రమణ డాక్టర్ బాలరాజు, డాక్టర్ నవీన్, అబ్దుల్లా, వెంకటసుబ్బయ్య, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగింపు

కలికిరి, మార్చి 4, ప్రభాతవార్త:

మండలంలోని మర్రికుంటపల్లె గ్రామ పంచాయతీ పెద్దఎల్లంపల్లి రోడ్డు మార్గంలో ఉన్న ముళ్లపొదలను స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ తొలగించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. కలికిరి–కలకడ మెయిన్ రోడ్డు నుంచి పెద్దఎల్లంపల్లికి పోయే రోడ్డు మార్గంలో ఇరువైపులా ముళ్లపొదలు పెరిగి వాహనాలరాకపోకలకు ఇబ్బందిగా మారింది. అదే విధంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయం స్థానికులు సర్పంచ్ దృష్టికి తేవడంతో వెంటనే సర్పంచ్ రెడ్డిరామ్, పంచాయతీ కార్యదర్శి గంగాదేవీలు స్పందించి ముళ్లపొదలు జేసీబీతో తొలగించారు. దీంతో స్థానికులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

పోటీల్లో ఏ.వి.ఆర్ విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన

పీలేరు, మార్చి 4 ప్రభాతవార్త:

విద్యార్థులను ప్రశంసిస్తున్న దృశ్యం

పట్టణంలోని ఏ.వి.ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు 2025 సంవత్సరానికి గాను నిర్వహించిన ప్రతిష్టాత్మక పోటీలలో విశేష ప్రతిభ కనబరచి పాఠశాలకు గౌరవం తీసుకొచ్చారు. 5వ తరగతి విద్యార్థి సాసి చరణ్ 2025 సంవత్సరానికి నిర్వహించిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. కృషి, పట్టుదలతో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకతతో ఈ విజయాన్ని సాధించినట్లు పాఠశాల వర్గాలు తెలిపారు. అలాగే 9వ తరగతి విద్యార్థులు పి. నాసర్ మరియు ఎస్. ఉస్మాన్ ప్రతిష్టాత్మక ఇన్స్పైర్ మనక్ అవార్డ్స్ -2025కు ఎంపిక కావడం విశేషం. వారి వినూత్న ఆలోచనలు, సృజనాత్మక ప్రాజెక్టులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పి.బి. శోభ ప్రకాష్, సైన్స్ ఉపాధ్యాయులు అంజలి, సోము మరియు విజేతలైన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయాలతో ఏ.వి.ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రతిష్ట మరింత పెరిగిందని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు.

లక్ష్మీపాలెంలో పోలీసుల ఫుట్ పెట్రోలింగ్

బద్వేలు మార్చి 4 ప్రభాతవార్త

బద్వేల్ మండలం లక్ష్మీపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం పోలీసులు ముమ్మరంగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. బద్వేల్ ఇన్స్పెక్టర్ బి. రామకృష్ణ , ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామంలోని ప్రధాన రహదారులు మరియు నివాస ప్రాంతాలలో కాలినడకన పర్యటించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ.. గ్రామస్తులు తమ పశువుల పేడను రోడ్లకు ఇరువైపులా దిబ్బలుగా వేయడం వల్ల రహదారులు ఇరుకుగా మారి వాహనదారులకు తీవ్ర అంతరాయం కలుగుతోందని గుర్తించామన్నారు. అంతేకాకుండా, వర్షం పడినప్పుడు ఈ పేడ రోడ్డుపైకి విస్తరించి వాహనాలు జారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అలాగే అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న పేడ దిబ్బలను 24 గంటల్లోగా యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలి. నిబంధనలు అతిక్రమించి రహదారిని ఆక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జ రుగుతుంది. పరిసరాల పరిశుభ్రత పాటించని పక్షంలో జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. గ్రామస్తులు మరియు రైతులు పోలీసులకు సహకరించి, రహదారులు సాఫీగా ఉండేలా చూడాలని వారు కోరారు.

పన్ను వసూలు మొదటి ప్రాధాన్యత

పోరుమామిళ్ల రూరల్, మార్చి 4 ప్రభాత వార్త:

ప్రస్తుతానికి సంవత్సరం ఆస్తి పన్ను వసూలు చేయడమే అధికారులు మొదటి ప్రాధాన్యతగా భావించి కష్టించాలని బద్వేల్ డివిజనల్ డెవలప్మెంట్ అధికారి వెంకట శేషయ్య పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్ల పట్టణం లోని స్త్రీ శక్తి భవన్లో ఆయన మండలంలోని పంచాయతీ అభివృద్ధి అధికారులు సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పలు విషయాల గురించి సమీక్ష చేశారు. ఇంటి పన్ను వసూలు చేయడంలో ప్రగతి సాధించాలని సూచించారు. రంగ సముద్రం, పోరుమామిళ్లలో 8 వంతున ప్రత్యేక టీములను పన్ను వసూలు కోసం నియమించి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని వివరించారు 100 చేరింతవరకు ఈ డ్రైవ్ కొనసాగుతుందని చెప్పారు. ప్రతిరోజు 500000 వసూలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. పంచాయతీ అభివృద్ధి చెందాలంటే ఆదాయ వంటలు ముఖ్యమని ఆ దిశగా అధికారులు కృషి చేయాలని కోరారు. వీటితోపాటు ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు ఇతర పనులను లక్ష్యాలకనంగా చేరుకోవాలని చెప్పారు. ఇంటి పన్ను 100 చేరుకునే వరకు పంచాయతీరాజ్ శాఖ సిబ్బందికి సెలవులు కూడా రద్దు చేశారని వివరించారు. ప్రతి ఒక్కరూ కృషి చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అంతకుమును రంగసముద్రం పంచాయతీకి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలకు ఇంటి పన్నుపై ఆగవాన కల్పించారు.కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై వెంకటేశ్వర స్వామి వారు

రామసముద్రం,మార్చి 4 ప్రభాతవార్త



మండలంలోని చంబకూరు గ్రామపంచాయతీలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారిని పలు రకాల పుష్పాలతో అర్చకులు కార్యనిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించి మేళ తాళాలతో డప్పు వాయిద్యాల మధ్య బాణ సంచాలు కాలుస్తూ ఘనంగా పురవీధులలో ఊరేగింపు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమాన్ని రెడ్డి వంశస్థులు నిర్వహించడం ఆనవాయితీ.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

దువ్వూరు, మార్చి 04, ప్రభాతవార్త:



మండల పరిధిలోని బుక్కాయపల్లె, మాసన పల్లె గ్రామాలలో జరుగుతున్న పనులను బుధవారం ఎంపీడీవో సుబ్బారెడ్డి పరిశీలించారు. బుక్కాయపల్లెలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 30 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న పంచాయతీ భవనాన్ని అలాగే స్మశాన వాటిక పను లను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. మాసనపల్లెలో పంచాయతీ భవన నిర్మాణాన్ని కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ పనులు నాణ్యతపరంగా చేయాలన్నారు. పనుల్లో లోపాలు కనబడి తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఏపిఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వార్త

రిపోర్టర్స్ కావలెను

తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

అన్నమయ్య జిల్లా

పుంగనూరు, సదుం, సోముల

పుంగనూరు రూరల్, వాయల్పాడు, కలకడ

ఇంటర్వ్యూ తేది : 08.03.2026

మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.

సెల్ నెం. 9848787289, 8919566086